జాతీయ తెలుగు దినపత్రిక

NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ ఆదివారం 26 జూలై 2026 సంపుటి : 16 సంచిక : 174 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం విశేషం: తొలి ఏకాదశి, తొలుతేరుపు అదనధ సూర్యోదయం: 5:37 । సూర్యాస్తమయం: 6:30 చంద్రోదయం: 3:15 । చంద్రాస్తమయం: 2:35 తిథి: శుద్ధ ఏకాదశి ఉ. 11:41 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం: అనురాధ ఉ. 5:54 వరకు, తదుపరి జ్యేష్ఠ యోగం: బ్రహ్మం రా. 11:04 వరకు, తదుపరి ఇంద్రం కరణం: భద్ర ఉ. 11:41 వరకు, తదుపరి బవ రా. 12:40 వరకు, తదుపరి బాలువ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

## కోరలు చాస్తున్న తాగునీటి 'గండం'

### అడుగంటుతున్న చెరువులు... జలాశయాలు



నిజామాబాద్

జులై నెల ముగుస్తున్నా జిల్లాలో భారీ వర్షాల జాడ లేదు. జలాశయాలు, చెరువులు వెలవెలబోతున్నాయి. తాగునీటి నిల్వలు 25 రోజులకు మాత్రమే సరిపడా ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఇకనైనా వరుణుడు కరుణించకుంటే ఉమ్మడి జిల్లాకు తాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవు. మరోవైపు నత్తనడకను తలపించే పైపులైన్ పనులు.. లీకేజీల పరంపర వెరసి ఎద్దడి మరింత కమ్ముకునేలా ఉంది. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి ఆర్మూర్, బాల్కొండ, కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని 875 గ్రామాలు, సింగూరు ప్రాజెక్టు నుంచి బోధన్ జుక్కల,? బాన్సువాడ, ఎల్లారెడ్డి 3 మండలాల్లోని 819 గ్రామాలకు 'మిషన్ భగీరథ' ద్వారా తాగునీరు అందిస్తున్నారు. 19 టీఎంసీల సామర్థ్యం గల సింగూరు జలాశయంలో ప్రస్తుతం ఐదు, నిజాంసాగర్‌లో ఆరు టీఎంసీలే ఉన్నాయి. ఇవి మరో 25 రోజుల తాగునీటి అవసరాలు తీర్చగలవు. శ్రీరామసాగర్ జలాశయం నుంచి జక్రాన్‌పల్లి మండలం ఆర్గుల్ నీటి శుద్ధి కేంద్రానికి ప్రస్తుతం నీళ్లు సరఫరా అవుతున్నాయి. ఇక్కడి నుంచి కామారెడ్డి జిల్లా మల్లన్నగుట్ట నీటిశుద్ధి కేంద్రానికి కొత్త పైపులైన్ నిర్మించలేదు. పాత జీఆర్ఎఫ్ (గ్లాస్ రెయిన్‌ఫోర్స్‌డ్ ఫైబర్) పైపులైన్‌కే మిషన్ భగీరథను అనుసంధానం చేశారు. కొత్త పైపులైన్ పనులను ప్రభుత్వం రూ.142 కోట్లతో రెండేళ్ల కిందట ప్రారంభించింది. అటవీ అనుమతుల్లేక ఇందల్‌వాయి దగ్గర 4 కి.మీ. దూరం పనులు నిలిచాయి. ఈ కారణంగా కామారెడ్డి జిల్లాలోని 215 గ్రామాలకు తాగునీరు అందడం లేదు. పంచాయతీ బోర్ల నుంచి సరఫరా చేస్తున్నారు. భూగర్భ జలాలూ వేగంగా పడిపోతున్నాయి.

**నిజామాబాద్ నగరంలో..**

4.68 లక్షల జనాభా గల నిజామాబాద్ నగరపాలికకూ తాగునీటి గండం పొంచిఉంది. అలీసాగర్‌లో 35, మాసాని, మంచిప్ప చెరువుల్లో 20 రోజులకు సరిపోయే నీటి నిల్వలే ఉన్నాయి. ప్రస్తుతం సగం మోటార్లతోనే నగరంలోని ట్యాంకులను నింపుతున్నారు. అలీసాగర్ పైపులైన్ 50 ఏళ్ల నాటిది. ఏటా లీకేజీల మరమ్మతులకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయినా ఏడాదికే సమస్యలు పునరావృతం అవుతున్నాయి. మంచిప్ప, మాసాని చెరువుల పైపులైన్లదీ ఇదే పరిస్థితి. మాసాని చెరువు నుంచి ఖిల్లా ఫిల్టర్‌బెడ్ వరకు నిర్మిస్తున్న నూతన పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 'అలీసాగర్, మాసాని చెరువులను నిజాంసాగర్ జలాలతో వారంలోగా నింపుతాం. తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యం ఇస్తాం. పైపులైన్ పనులు వేగంగా పూర్తి చేసేలా చూస్తాం' అని నగరపాలిక ఈఈ తిరుపతి అన్నారు.

## యువత పోరాటానికి దిగొచ్చిన కేంద్రం




మోర్తాడ్

యువత పోరాట పటిమతో కేంద్ర ప్రభుత్వం దిగి రాకతప్పలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత రాజకీయాలకతీతకంగా తమ భవిష్యత్తు, విద్యావ్యవస్థలో పారదర్శక త కోసం చేపట్టిన ఉద్యమంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని, ఇది దేశ యువత పోరాటంతో సాధించిన ప్రజాస్వామ్య విజయమని ఓ ప్రకటనలో అభివర్ణించారు. పరీక్షల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి వ్యతిరేకంగా యువత శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేసిన పోరాటానికి కేంద్రం దిగిరాక తప్పలేదన్నారు. భవిష్యత్తు కోసం విద్యార్థులు, యువత ధైర్యంగా ఉద్యమం కొనసాగించారని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల పోరాటాన్ని అణచి వేసేందుకు కేంద్రం లాఠీచార్జీలు, భాష్పవాయు గోళాలు వినియోగించడంతో పాటు అనేక నిర్బంధాలు విధించినప్పటికీ, యువత ఏ మాత్రం వెన క్కి తగ్గకుండా ధైర్యంగా ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. అధికారం ఎంత బలంగా కనిపించినా చైతన్యవంతమైన యువత సంకల్పం ముందు తలవంచక తప్పదనే విషయాన్ని ఈ ఉద్యమం మరోసారి నిరూపించిదన్నారు.

## ఏ ఒక్కరూ ఓటు కోల్పోకుండా చూడాలి



మాచారెడ్డి/భిక్కనూరు

'సర్' ప్రక్రియలో భాగంగా ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా బీఆర్ఎస్ శ్రేణులు బాధ్యతగా పనిచేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు. శనివారం ఆయన మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, భిక్కనూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు,

- మిగతా2లో

## కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఆగ్రహం

### సంక్షేమాన్ని విస్మరించిన రేవంత్ సర్కార్

### రాబోయే రోజుల్లో వచ్చేది కేసీఆర్ పాలనే

### బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వీజీ గౌడ్

### బోధన్‌లో 'సర్'పై ముఖ్య కార్యకర్తలతో సమావేశం



మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి వీజీ గౌడ్ అన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ నివాసంలో శనివారం బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ సమన్వయ కమిటీల సభ్యులు, నా యకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీజీ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. వచ్చేది కేసీఆర్ పాలనేనని, మళ్లీ ప్రజలకు మంచి రోజులు రానున్నాయని పేర్కొన్నా రు. ఎక్కడచూసినా ప్రతి నోటా రేవంత్‌రెడ్డి పాల న పోవాలని అంటున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి గద్దె దిగకతప్పదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వారితో మమేకం కావాలని సూచించారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రేవంత్‌రెడ్డి ద్రోహాన్ని కూడా చెబుతూ ఓటర్లను చైతన్యవంతులు చేయాలని పిలుపుఇచ్చారు. 38 నెలల పాలనలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తట్టెడు మట్టిని ఎత్తిపోయలేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా కన్నెపల్లి వద్ద లక్షా 95 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నప్పటికీ, ఆ నీటిని రైతులకు అందించడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కన్నెపల్లి హౌస్ నుంచి మల్లన్నసాగర్ ద్వారా హల్దీవాగు గుండా నిజాంసాగర్‌కు నీటిని తరలించడానికి అవకాశం ఉన్నదని, అవగాహన లేని రేవంత్‌రెడ్డితో నిజాంసాగర్ నిండే అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా సకల రాజోపాచారాలతో పూజలు అందుకుంటున్న మన గ్రామ సీతారామస్వామి.





**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) జులై. 25** ఇందల్వాయి మండల కేంద్రంలోని గ్రామంలో రామాలయం యొక్క గొప్ప విశిష్టత ఈనాటిది కాదు ఇట్టి ఆలయం మన గ్రామంలో ఉండటం మన యొక్క అదృష్టం మన దేవాలయ విశిష్టత మనందరికీ తెలుసు మనం గత జన్మలో చేసుకున్న పుణ్యం కావచ్చు తిరుపతిలో గల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల మాదిరి సకల రాజోపచారాలతో పూజా కార్యక్రమాలు జరగటం అని మనందరం మన కన్నులతో సాక్షాత్కారంగా చూడటం మన యొక్క అదృష్టం ఇలాంటి పూజా కార్యక్రమాలు అందుకుంటున్న మన దేవాలయం మన గ్రామంలో నెలకొను ఉంది సీతారామచంద్రస్వామి దేవాలయం మన ఈదుల వాయి గ్రామంలో ఇలాంటి అద్భుతమైన విగ్రహాలు రక్షింపబడి ఉండటం మన యొక్క అదృష్టం రామచంద్ర స్వామి అమ్మ సీతాదేవి తన యొక్క తొడలపై కూర్చుండబెట్టుకొని ప్రసన్నంగా ఉండటం ఇలాంటి విగ్రహాలు మన దేవాలయంలో ఉండటం మన గ్రామంలో ఉండటం మన అదృష్టం అట్లాగే లక్ష్మణ స్వామి మూర్తి లేకపోవడం ఒక విచిత్రం దాదాపుగా ప్రతి రామాలయంలో సీతాదేవి రాముడు లక్ష్మణుడు అయితే మన గ్రామంలో ఉన్న దేవాలయంలో లక్ష్మణ స్వామి విగ్రహం లేకపోవడం ఒక రకంగా విచిత్రమైన చారిత్రక ఆధారాలతో పరిశీలించిన యెడల ఇది గొప్పనైన ఒక విషయం కలిగి ఉంది లక్ష్మణుడు శ్రీహరి యొక్క శేషశయనం యొక్క ఒక రూపం అందుకే మన గ్రామంలో ఉన్న వ్యక్తి రామాలయంలో శేషరూకుడైన లక్ష్మణ స్వామి శేషనాగు మన దేవాలయం చుట్టూ రక్షణ నిమిత్తం నిత్యం తిరుగుతూ ఉంటాడు ఇదే ఇట్టి కథ యొక్క విశిష్టత అందుకే మన రామాలయంలో ప్రతిష్టింపబడిన సీతారామస్వామి తో పాటు మన గుడి చుట్టూ శేషావతారుడైన లక్ష్మణుడు నిత్యం తిరుగుతూ ఉంటాడు ఇదే మన దేవాలయం యొక్క గొప్ప విశిష్టత ఇలాంటి అద్భుతమైన విషయాన్ని గొప్పతనాన్ని దేశంలో గల అందరికీ సమస్త లోకానికి తెలియచేసేటట్లు చేసిన ఒక మహా వ్యక్తి మన గ్రామానికి 196 సంవత్సరాలకు అనగా జులై నెలలో 25వ తేదీన 1830 సంవత్సరములు మన గ్రామాన్ని మన దేవాలయాన్ని సందర్శించడం దాని యొక్క పూర్తి వివరాలు అన్నింటిని తన యొక్క గ్రంథంలో రాయటం జరిగింది ఇది చాలా గొప్పతనం అతను ఏనుగుల వీరస్వామి గారు చెన్నపట్నంలోని సుప్రీంకోర్టులో దుబాసిగా ఉద్యోగం ఉద్యోగం చేసి పదవి విరమణ చేసి రిటైర్మెంట్ ఆయన వ్యక్తి శ్రీ ఏనుగుల వీరస్వామి గారు ఆయన చిన్నా పట్నంకు ఉత్తరాన సముద్రం పక్కన గల ఊరు తండయూర్ వీడు అనే గ్రామానికి చెందినవాడు అలాంటి వ్యక్తి తన యాత్రలో 1830 సంవత్సరం జూలై మాసం 25వ తేదీన మన గ్రామానికి రావటం మా మన దేవాలయాన్ని సందర్శించడం ఇట్టి విషయాన్ని మన దేవాలయ గొప్పతనాన్ని సకల విషయాల్ని అన్నింటిని కూలంక్షకంగా అనగా దేవాలయం అప్పటి మన ప్రాంతం దేవాలయం శస్తుల యొక్క సంస్థానం ఆధీనంలో ఉంది సర్వోపాచారాలతో పూజలందుకుంటూ ఉంది అనే తెలియజేస్తూ ఇక్కడి అట్టిక రాజకీయ పరిస్థితులను తెలియజేస్తూ మన దేవాలయం ఒక బురద గుంటలో వేసిన తామర పువ్వు చందన్ లా ఉంది అని పేర్కొన్నాడు అప్పటి సమాజపు లక్షణాలు అన్నింటిని సవివరంగా పేర్కొంటూ తన యొక్క యాత్ర విషయాన్ని అన్నిటిని తెలియజేస్తూ తను వ్రాసిన కాశీ యాత్ర రచనలో రాయడం జరిగింది దాదాపుగా 1830 సంవత్సరం 196 సంవత్సరాల క్రితం మన గ్రామాన్ని సందర్శించి మన గ్రామంలోని అన్ని విషయాలను సకల ప్రపంచానికి దేశానికి తెలియజేసే విధంగా తన యొక్క రచనలో కాశీయాత్ర అనే బుక్ లో శ్రీ ఏనుగుల వీరస్వామి గారు సవివరంగా తెలియజేశారు అప్పటి మన ప్రాంతంలో వంశస్తులైన ఫీలింగ్ జమీందారులైన సంస్థానా దేశంలో ఉంది అట్టి దేవాలయం దక్షిణ దేశ మర్యాదపరంగా ఉన్నతంగా తిరుపతి దేవస్థానంలో గల గుడి మాదిరిగా సర్వరాజోపచారాలతో పూజలందుకుం టున్న దేవాలయం మన ఈదులవాయి గ్రామంలో కుంపట్లో మెరిసిన తామర పువ్వుల పూజలు అందుకుంటూ ఉంది అని అన్ని విషయాలను సవివరంగా అందరికీ తెలిసేటట్లు తన




యొక్క రచన గ్రంథం కాశీ యాత్ర పుస్తకంలో పూర్తిగా వివరించాడు అప్పటి మనదేశ రాష్ట్రంలో గల రాజకీయ పరిస్థితులను పేర్కొనడం సవివరంగా వ్రాయటం జరిగింది అయితే ఏనుగుల వీరస్వామి గారు తన గ్రంథంలో ఈదుల వాయి అని పేర్కొనడం జరిగింది మన గ్రామం ఇప్పటి ఇందల్వాయి ఇది మన ఉచ్చారణ పరంగా అయింది కావున ఇట్టి సకల విషయాల్ని మన గ్రామ విశిష్ట గొప్పతనాన్ని తెలియజేసిన ఏనుగుల వీరస్వామి గారికి మన గ్రామస్తులందరి తరపున ధన్యవాదాలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ దుంపల గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు

## తొలి ఏకాదశి సందర్భంగా తిమ్మాపూర్ టిటిడిలో పోచారం ప్రత్యేక పూజలు

# రూ.70 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ



**బీర్కూర్, జూలై 25 (ప్రజాజ్యోతి ):** ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం (ఋణ)లో



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బీర్కూర్, వర్ని మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం కొండ కింద నుంచి ఆలయం వరకు కాలి నడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.20 లక్షల వ్యయంతో మెట్ల మార్గం, రూ.50 లక్షలతో లైనింగ్ వాల్ నిర్మాణ పనులకు పోచారం శ్రీనివాస రెడ్డి





భూమిపూజ చేశారు. ఈ అభివృద్ధి పనులతో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

# కొట్టాలపల్లిలో గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లపై ఆకస్మిక తనిఖీ

**డ్రైనేజీ పనులను పరిశీలించిన కామారెడ్డి ఎంపీడీవో హెప్సీబా రాణి**

**అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశం**







**కామారెడ్డి ప్రతినిధి జూలై 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం కోటల పల్లి గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన కామారెడ్డి మండల ఎం పి డి ఓ హేబ్సిబ రాణి శనివారం మండలంలోని కొట్టాలపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి అర్హులైన లబ్ధిదారుకు ప్రభుత్వం కల్పిస్తున్న గృహ నిర్మాణ పథకం ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలకు ముగ్గు వేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో, పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఎంపీడీవో పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను అధికారులు సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి దేవలక్ష్మి, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గాయపడిన మనోజ్‌కు గ్రామస్తుల అండ.. రూ.51 వేల ఆర్థిక సహాయం



**ఇందల్వాయి,( ప్రజా జ్యోతి ) జులై. 25** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మనోజ్ రెండు నెలల క్రితం చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. మనోజ్ వైద్య చికిత్సకు చేయూతగా ఎల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ సుజాత–శేఖర్ దంపతులు ముందుకొచ్చారు. వారి ఆధ్వర్యంలో గ్రామ యువత, స్నేహితులు, పలువురు నాయకులు కలిసి విరాళాలు సేకరించి మొత్తం రూ.51,000 నగదును మనోజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మనోజ్ త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ మనోజ్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇస్రోజివాడిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

**తొలి దశలో పిల్లర్ గుంతల తవ్వకం ప్రారంభం**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 25: ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తొలి దశలో పిల్లర్ గుంతల తవ్వకం పనులను కాంట్రాక్టర్ రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిందం మల్లేష్, ఉపసర్పంచ్ సిద్ధం స్వామి, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చే పథకం ఇది అని తెలిపారు. పనులు త్వరగా, నాణ్యతగా పూర్తి చేస్తామని చెప్పారు. ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామ సహకారంతో పనులు సజావుగా సాగుతాయని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ పథకం పేదలకు వరమని హర్షం వ్యక్తం చేశారు.

# కామారెడ్డి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మలవత్ రవీందర్ నాయక్ ఏకగ్రీవ ఎన్నిక

**ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధే లక్ష్యమని నూతన కమిటీ ప్రతిజ్ఞ**



**కామారెడ్డి ప్రతినిధి, జూలై 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండల ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా మలవత్ రవీందర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తి ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్షుడు మలవత్ రవీందర్ నాయక్‌కు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. గ్రామస్థాయి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఉప సర్పంచ్‌లు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, వారికి తగిన గుర్తింపు, అధికారాలు, సంక్షేమం కోసం ఫోరం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు మలవత్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, మండలంలోని ఉప సర్పంచ్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి మండల పరిధిలోని ప్రతి ఉప సర్పంచ్‌కు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఉప సర్పంచ్‌లు మరింత చురుకుగా పనిచేసేలా కృషి చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడిగా బచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా తోట శిరీష భూపతి, క్యాషియర్‌గా కమ్మరి స్వప్న లక్ష్మీనారాయణ, సలహాదారులుగా చింతల నర్సింలు, రాజశేఖర్, కొండి అశోక్ గూడెం ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్యక్షులు అభినందించి, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మండల పరిధిలోని పలువురు ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు గ్రామాల అభివృద్ధి, ఉప సర్పంచ్‌ల ఐక్యత, హక్కుల సాధన, స్థానిక సంస్థల బలోపేతం కోసం సమిష్టిగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. నూతన కమిటీ ఎన్నికతో కామారెడ్డి మండల ఉప సర్పంచ్‌లలో నూతన ఉత్సాహం నెలకొంది. రాబోయే రోజుల్లో మండలంలోని ఉప సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, గ్రామాభివృద్ధికి మరింత కృషి చేయాలని సభ్యులు నిర్ణయించారు.

# ప్రజా పోరాటాల ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచాల్సిందే

**పేపర్ లీక్‌లపై దేశవ్యాప్త విద్యార్థి ఉద్యమాల విజయానికి సీపీఎం కామారెడ్డి**

**జిల్లా కమిటీ అభినందనలు ఎన్‌టీఏను రద్దు చేయాలి**

**పరీక్షల వికేంద్రీకరణ చేపట్టాలి**

**జాతీయ విద్యా విధానం--2020ను ఉపసంహరించుకోవాలి**

**జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్**



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 25 (ప్రజాజ్యోతి):** ప్రజల ఐక్య పోరాటాలు, విద్యార్థి-యువజన ఉద్యమాల ముందు ఎంతటి ప్రభుత్వమైనా తలవంచక తప్పదని మరోసారి రుజువైందని సీపీఎం కామారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ప్రశ్నపత్రాల లీక్‌లపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విద్యార్థులు, యువత చేపట్టిన నిరంతర ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గేలా చేశాయని ఆయన అన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పేపర్ లీక్‌ల కారణంగా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, పలువురు మానసిక వేదనకు లోనయ్యారని, 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాసంఘాలు నిర్వహించిన ఉద్యమాలు చారిత్రాత్మక విజయాన్ని సాధించాయని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జీలు, నిర్బంధాలు, ఇతర అణచివేత చర్యలకు పాల్పడినా ఉద్యమం వెనక్కి తగ్గలేదన్నారు. వివిధ విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు, తల్లిదండ్రులు, ప్రజల మద్దతుతో ఉద్యమం మరింత బలపడిందని, చివరకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహాన్ని గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి వైదొలగడాన్ని సీపీఎం స్వాగతిస్తోందని పేర్కొన్న చంద్రశేఖర్, అది మాత్రమే సరిపోదన్నారు. ప్రశ్నపత్రాల లీక్‌లకు, పరీక్షల నిర్వహణలో జరిగిన తీవ్ర వైఫల్యాలకు ప్రధాన కారణంగా నిలుస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఒకే సంస్థ ద్వారా పరీక్షలు నిర్వహించడం వల్ల అవినీతి, అక్రమాలకు అవకాశాలు పెరుగుతున్నాయని, పరీక్షల వికేంద్రీకరణ ద్వారానే పారదర్శకత, విశ్వసనీయత సాధ్యమవుతుందని తెలిపారు. వాణిజ్యీకరణ, కేంద్రీకరణ, మతతత్వ విధానాలను ప్రోత్సహిస్తున్న జాతీయ విద్యా విధానం--2020ను కూడా కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం, విద్యను హక్కుగా పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైతే పేపర్ లీక్‌లు, పరీక్షలలో అవకతవకలు, విద్యార్థులపై వివక్షలు కొనసాగుతూనే ఉంటాయని చంద్రశేఖర్ హెచ్చరించారు. విద్యార్థి, యువజన ఉద్యమాలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మరింత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి ఉద్యమాలను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాల ద్వారా సాధించిన ఈ విజయం దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని, విద్యార్థుల ఐక్యత, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని సీపీఎం పేర్కొంది. ఈ కార్యక్రమంలో కొత్త నరసింహులు, వెంకట్ గౌడ్, మోతిరామ్, ముధం అరుణ్, దొడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు

# కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో బీజేపీ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**చిల్లర రాజకీయాలు మానుకోవాలి.. అభివృద్ధికి సహకరించాలి: చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి**



**కామారెడ్డి, ప్రతినిధి జూలై 25 ప్రజాజ్యోతి:** కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో బీజేపీ కౌన్సిలర్ల వైఖరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంఘ్వాన్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ గిరికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పట్టణ ప్రజల అభివృద్ధి కోసం కౌన్సిల్‌లో ప్రవేశపెట్టే ఎజెండాల కంటే బీజేపీ కౌన్సిలర్లకు వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. పాలకపక్షం ప్రతిపాదిస్తున్న అభివృద్ధి పనులను అడుగడుగునా అడ్డుకుంటూ, ప్రతి సమావేశాన్ని గొడవలు, రభసతో నిలిపివేస్తున్నారని విమర్శించారు. కౌన్సిల్‌లో తమకు కమిషన్లు వచ్చే పనులకు మాత్రమే ఆమోదం తెలపాలని, లేదంటే సమావేశాలను సాగనివ్వబోమని బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు అవసరమైన పార్కులు, డ్రైనేజీలు, రహదారుల వంటి అభివృద్ధి పనులను కూడా అడ్డుకుంటూ, తమకు నచ్చిన పనులకే ఆమోదం ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులపై కూడా తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. బీజేపీ గతంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేదని, కామారెడ్డి నియోజకవర్గ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వ్యక్తిగతంగా పనులు చేయిస్తామని చెప్పి వాటిని కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ కామారెడ్డి పట్టణ అభివృద్ధికి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని అన్నారు. మున్సిపల్ అధికారులపై అవినీతి ముద్ర వేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని, కౌన్సిల్‌ను పార్టీ కార్యాలయంలా మార్చుకునే ప్రయత్నాలు మానుకోవాలని చైర్‌పర్సన్ హెచ్చరించారు. ప్రజలు ఎన్నుకున్న పాలకపక్షాన్ని అడ్డుకుని పట్టణ అభివృద్ధిని నిలిపివేయాలని చూస్తే సహించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే పట్టణ అభివృద్ధి కోసం ఎంతదూరమైనా వెళ్తామని, నిబంధనల ప్రకారం కౌన్సిల్ సమావేశాలను సజావుగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల అభివృద్ధికి అడ్డుపడితే ప్రజాక్షేత్రంలోనే తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. బీజేపీ కౌన్సిలర్లు కమిషన్ల ఏజెంట్లలా కాకుండా ప్రజల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు షేరు, అంజాద్, వాజీద్, సుల్తానా, లలిత, కళ్లే సావిత్రి, తహసున్నిసా, అఫ్రీన్ సుల్తానా, మహేష్, బబ్లు, జావీద్, గంగాధర్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నా



కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ప్రధాన్ రాజీనామాతో దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు చేసిన పోరాటాన్ని చూసి గర్విస్తున్నామని అన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువతకు, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. కేంద్ర మంత్రి ప్రధాన్ రాజీనామా చేసినప్పటికీ, మరో రెండు డిమాండ్ మిగిలే ఉన్నాయని రాహుల్ అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని, నిరసనకారులపై జరిగిన లాఠీఛార్జీపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు సమయం అసన్నమైందని రాహుల్‌గాంధీ అన్నారు.

"ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో కీలక ముందడుగు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మిమ్మల్ని చూస్తుంటే నాకు ఎంతో గర్వంగా ఉంది. కేంద్రం చేతిలో దాడులు, అణచివేతకు గురవుతున్న రైతులు, కార్మికులు, పేదలు- ఇలా సమాజంలోని ప్రతి వర్గానికి ఇదొక సంకేతం. ఎదిరించి నిలబడటంలోనే ధైర్యం, విజ్ఞత ఉన్నాయి . భయపడకండి, ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదాం. ఇంకా రెండు డిమాండ్లు నెరవేర్చాల్సి ఉంది. మొదటిది : విద్యార్థుల వైపు వేలు లేవనెత్తి, వారిని కొట్టిన ప్రతి ఒక్కరినీ బాధ్యులను చేయాలి. రెండోది : కనీస గౌరవంతో విద్యార్థులకు ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి."

**మోదీ ప్రభుత్వానికి మేలుకొలుపు**

ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉందని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో నిరుద్యోగం సంక్షోభస్థాయికి చేరిందని పేర్కొన్నారు. ఒక దేశాన్ని, వ్యవస్థలను నడిపే తీరు ఇది కాదని విమర్శించారు. దేశంలో విద్యా వ్యవస్థ, మీడియా, సమాఖ్య వ్యవస్థలు గాడితప్పాయన్నారు. విద్యార్థుల ఆందోళనలు దేశంలో ఉన్న తీవ్రమైన సంక్షోభానికి నిదర్శనమని, మోదీ ప్రభుత్వానికి ఇది ఒక మేలుకొలుపు అని పేర్కొన్నారు. ఈ సంక్షోభాలను పరిష్కరించే వరకు కాంగ్రెస్ ఆందోళన కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులపై జరిపిన అణిచివేతను సోమవారం పార్లమెంటులో ప్రశ్నిస్తామని అన్నారు. విద్యార్థులపై జరిగిన దాడులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యుడని ఆరోపించారు. అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని రాహుల్ స్పష్టం చేశారు.

**విద్యావ్యవస్థలోకి ఆర్ఎస్ఎస్**

"మన దేశ విద్యావ్యవస్థ గొప్పదని ప్రపంచమంతా పేరుంది. కానీ దీనిని క్రమంగా ప్రైవేటీకరణ చేస్తున్నారు. నిరుద్యోగం పెరగడంతో యువత ఆగ్రహంతో ఉన్నారు. అందుకే విద్యావ్యవస్థ ప్రక్షాళన జరగాలని యువత కోరుకుంటున్నారు. కానీ మన విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ ప్రభావితం చేస్తోంది. విద్యా వ్యవస్థలోకి ఆర్ఎస్ఎస్ దొడ్డిదారిన చొరబడి, చెరబట్టింది. అందుకే దేశ విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ కబంధహస్తాల నుంచి విముక్తం చేయాల్సిన అవసరం ఉంది. తాజాగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, వీరి డిమాండ్లకు కేంద్రం ఒప్పుకోవడం అనేది విద్యార్థుల సాధించిన ఘనవిజయం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**యువత దెబ్బకు కదిలిన అధికార పీఠం!**

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికార పీఠాన్ని యువత కదిలించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. విద్యావ్యవస్థను సరిదిద్దాలని కోరుతూ వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత చివరకు విజయం సాధించారని కొనియాడారు. ఈ అవినీతి ప్రభుత్వం కారణంగా తమ బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రులకు ఇది గొప్ప ఊరట అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ యువతరానికి క్షమాపణలు చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు.

**మా డిమాండ్లకు లిఖితపూర్వక హామీ ఇవ్వాల్సిందే!**

నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) శనివారం కీలక వ్యాఖ్యలు చేసింది. తమ మూడు డిమాండ్లను తీరుస్తామని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే ఈ రోజు సాయంత్రం 6 గంటలకు కొవ్వొత్తుల ప్రదర్శన (క్యాండిల్ మార్చ్) నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఆ మూడు డిమాండ్లు ఏమిటంటే, 1. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం (ఇది పూర్తయ్యింది.) 2. బలవన్మరణానికి పాల్పడిన నీట్ అభ్యర్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం చెల్లించాలి. 3. నిరసనకారులపై నమోదైన ఎఫ్?ఐఆర్?లు తక్షణం ఉపసంహరించుకోవాలి. ఈ మూడు డిమాండ్లను తీరుస్తామని లిఖితపూర్వకంగా అంగీకరిస్తే, తాము ఇళ్లకు వెళ్లిపోతామని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా పేర్కొన్నారు. ఇక ?కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం అనేది ఒక సాధారణ మానవుడు సాధించిన విజయంగా సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా అభివర్ణించారు. నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థుల నిరసనలు తార స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. దేశ యువత అయోమయ వలయంలో చిక్కుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల విస్తృత ప్రయోజనాలను కాపాడేందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఇది యువత సాధించిన విజయమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించిన సర్పంచ్..

-అశ్విని సుదర్శన్. కంకర్నె.



**బిచ్కుంద 25 జులై (ప్రజా జ్యోతి )** కామారెడ్డి జిల్లా. మద్నూర్ మండలంలోని తడి హిప్పర్గ గ్రామంలో. ఇందిరమ్మ ఇల్లు. నిర్మాణాలను ఆ గ్రామ కార్యదర్శి జ్యోతి జాదవ్. ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అశ్విని సుదర్శన్ ను మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని, ప్రతి లబ్దిదారునికి రూ.5 లక్షలు అందిస్తుందన్నారు. ఇంటి నిర్మాణాలకై ప్రభుత్వ సహాయ సహకారాల ఉంటాయని, లబ్దిదారులందనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ క్రమంలో శనివారం ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారురాలు. సంగీత కృష్ణ జూబ్రే.ఇంటికి ముగ్గుతో మారుకోటు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జ్యోతి జాదవ్. స్టాఫ్ రిపోర్టర్.కంబ్లె మధుకర్. ప్రాల్హాద్.యాదవ్.కృష్ణ.శంకర్.తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించే మన గ్రామ సర్పంచ్

రాత్రి వేళల్లోనూ స్పందించి విద్యుత్ సమస్య పరిష్కారం



**కామారెడ్డి ప్రతినిధి జూలై 25 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో ప్రజా సేవకు మరో నిదర్శనం... గ్రామ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మన గ్రామ సర్పంచ్ గారు మరోసారి తన బాధ్యతను చాటుకున్నారు. గ్రామంలోని 1వ వార్డులో రాత్రి సుమారు 10 గంటల సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుడ్డి సమస్య కారణంగా కరెంట్ నిలిచిపోవడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు సహా గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను తెలుసుకున్న వెంటనే మన సర్పంచ్ గారు ఆలస్యం చేయకుండా స్పందించారు. రాత్రి సమయమని కూడా చూడకుండా సంబంధిత విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు సమాచారం అందించి, వెంటనే గ్రామానికి రావాల్సిందిగా కోరారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన సమస్య పరిష్కారం అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గ్రామానికి చేరుకున్న లైన్‌మెన్ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన మరమ్మతు పనులను పూర్తి చేశారు. అనంతరం విద్యుత్ సరఫరా తిరిగి పునరుద్ధరించబడడంతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజల సమస్యలు ఎప్పుడు వచ్చినా ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తున్న మన గ్రామ సర్పంచ్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. పదవి బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల పట్ల ఉన్న నిబద్ధతతో రాత్రి వేళల్లో కూడా స్పందించి సేవలందించడం అభినందనీయం. ఈ విద్యుత్ సమస్య పరిష్కారంలో సహకరించిన 10వ వార్డు మెంబర్ ప్రణీత్ గారు, 3వ వార్డు మెంబర్ అజీజ్ గారు, కోనింటి రవి గారు, బుల్లె మధు గారు, మామిడి బన్నీ గారులకు ప్రత్యేక కృతజ్ఞతలు. గ్రామ ప్రజల అవసరాల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి

## ఏ ఒక్కరూ ఓటు కోల్పోకుండా చూడాలి

-మొదటిపేజీ తరువాయి

భిక్కనూరు, మాచారెడ్డిలో 'సర్' ప్రక్రియపై బీఆర్ఎస్ నాయకులతో సమావేశం

బూత్ ఏజెంట్లతో 'సర్' ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గంలోని 267 బూత్‌లలో ఏ ఒక్క ఓటు కోల్పోకుండా డిజిటల్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. మాచారెడ్డి మండలంలో ఓటర్ ఆన్‌లైన్ ప్రక్రియ దాదాపు 90 శాతం, భిక్కనూరు మండలంలో 99శాతం పూర్తయినట్లు తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మినహాయించకుండా, కొత్త ఓటర్ల నమోదు చిరునామా మార్పులు వివరాల సవరణలో పార్టీ కార్యకర్తలు బీఎల్వోలకు సహకరించాలని సూచించారు. ఆగస్టు 3 వరకు కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. 'సర్' ప్రక్రియ వందశాతం పూర్తయ్యేవరకూ ప్రతి బూత్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మాచారెడ్డి మండల అధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, హంజీనాయక్, బూస శ్రీనివాస్, బట్ట రమేశ్, తోకల కిషన్, అబ్దుల్ ఖాన్, శ్రీశైలం, శంకర్, బాబు, నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాజ్, దేవరాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరం

"ఒక దేశ నాశనానికి అణుబాంబులు కానీ, సుదూర క్షిపణులు కానీ అవసరం లేదు. విద్యా వ్యవస్థ ప్రమాణాలను తగ్గించి, విద్యార్థులను పరీక్షల్లో మోసం చేయడానికి అనుమతిస్తే చాలు.. ఆ దేశం తనంతట తానే కూలిపోతుంది."దక్షిణాఫ్రికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్ద పెద్ద అక్షరాలతో ఊ సత్యం రాసి ఉంటారు. సరిగ్గా ఈ కొటేషన్ మన దేశంలో నేడు చోటుచేసుకుంటున్న పరంపరలకు అద్దం పడుతోంది. దొరికినవాడే దొంగ.. దొరకనంత వరకు అందరూ దొరలే అన్నట్లుగా తయారైంది మన దేశంలోని పోటీ పరీక్షల తీరు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులలో, వారి తల్లిదండ్రులలో సృష్టించిన ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆధారాలతో సహా రుజువు కావడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి, తీవ్ర నిరసనల మధ్య మళ్లీ నిర్వహించింది. అంతవరకు బాగానే ఉంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే ఈసారి దొరికింది కాబట్టి లీకేజీ బయటపడింది; మరి దొరకకుండా వెనుక తలకాయలు నడిపిన ముఠాలు, గతంలో జరిగిన పరీక్షల్లో ఎంతటి అక్రమాలకు పాల్పడి ఉంటాయి? భవిష్యత్తులో ఇవి మళ్లీ జరగవని గ్యారెంటీ ఏమిటి?మన విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు అనేవి ఒక సాధారణ రుగ్మత గా మారిపోవడం సమగ్ర ప్రజాస్వామ్యానికే పెను ప్రమాద ఘంటిక. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన అత్యున్నత వైద్య విద్యా ప్రవేశ పరీక్ష నీట్ లో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కేసు విచారణను సిబిఐ కి అప్పగించడం, దర్యాప్తు సంస్థలు బీహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో నిందితులను అరెస్ట్ చేయడం, ముఠాల గుట్టు రట్టు చేయడం చరచరా జరిగాయి. హైటెక్ పద్ధతుల్లో వాట్సాప్ గ్రూపులు, సేఫ్ హౌస్‌లలో విద్యార్థులకు సమాధానాలు బట్టీ పట్టించడం వంటి ఘోరాలు వెలుగు చూశాయి. దేశంలో యువతరం రోడ్లపైకి వచ్చింది. లీకేజీల వ్యవస్థపై అసహనం శృతిమించి కాక్రోచ్ పేరుతో సరికొత్త నిరసన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. లీకేజీలు, వ్యవస్థాగత లోపాల వల్ల తమ భవిష్యత్తు చీకటిమయమవుతోందన్న ఆవేదన, ఆగ్రహం యువతలో ఏ స్థాయిలో ఉందో ఈ నిరసనల ఉధృతి స్పష్టం చేస్తోంది.మన దేశ పారదర్శకతకు పేపర్ లీకేజీలు కొత్తేమీ కావు. దశాబ్దాల చరిత్రను తిరగేస్తే, ప్రతిష్టాత్మక కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎన్నో సార్లు లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బయటపడి, రగడ తీవ్రమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు రద్దు నిర్ణయాలు తీసుకున్నాయి. సమాజం దృష్టికి రాని, ఆధారాలు దొరకని ఎన్నో సందర్భాల్లో అక్రమార్కులు అత్యున్నత ర్యాంకులు పొంది వ్యవస్థలోకి ప్రవేశించి ఉంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిజమైన ప్రతిభావంతులు, నిరుపేద విద్యార్థులు శాశ్వతంగా తమ అవకాశాలను కోల్పోయారు. గతంలో జరిగిన నష్టాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేకపోవచ్చు, కానీ భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని రక్షించడానికి శాశ్వత, కఠిన కట్టడి చర్యలు వంద శాతం అవసరం. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమానాలు లేదా చిన్నచిన్న కమిటీలతో సరిపెడుతున్న పాలకులు, ఈ వ్యవస్థాగత చీడను తుడిచిపెట్టే శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేయకపోవడమే అసలు విషాదం. పేపర్ లీకేజీల మహమ్మారి కేంద్ర పరిధిలోని పరీక్షలకే పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో వైఫల్యాలు అనేకమంది అభ్యర్థుల జీవితాలను బుగ్గిపాలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఎంసెట్ లీకేజీలు పదే పదే కలకలం రేపాయి. ముఖ్యంగా 2016 లో తెలంగాణలో జరిగిన ఎంసెట్-2 మెడికల్ పేపర్ లీకేజీ ఘటన దేశాన్నేగ్భ్రాంతికి గురిచేసింది. ఆల్ ఇండియా స్థాయిలో నెట్‌వర్క్ నడిపి, కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రింటింగ్ ప్రెస్ స్థాయి నుంచే పేపర్ లీక్ చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోనే కంప్యూటర్లు హ్యాక్ చేసి, అంతర్గత సిబ్బంది ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్, అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత భయంకరమైన ఉదంతం. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గిపోయిన నిరుద్యోగ యువత రోడ్లెక్కి ఉద్యమించాల్సి వచ్చింది. ఈ లీకేజీల ఫలితంగా పదే పదే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. తరచూ టెన్త్ క్లాస్ బోర్డు పరీక్షల ప్రశ్నాపత్రాలు పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఉపాధ్యాయులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అరెస్ట్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. మరోవైపు, ఒకే దేశం ? ఒకే పరీక్ష అనే అతిగా కేంద్రీకృతమైన నినాదం కూడా తీవ్రమైన సమస్యలను తెచ్చిపెడుతోంది. భారత్ లాంటి విభిన్నమైన, విశాలమైన దేశంలో కోట్లాది మందికి ఒకే ఏజెన్సీ ద్వారా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలనుకోవడం పరిపాలనాపరంగా అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. దేశంలో ఎక్కడో ఒక మూలన ఉన్న పరీక్షా కేంద్రంలో చిన్న లోపం జరిగినా, లేదా ఒక డిజిటల్ నెట్‌వర్క్ హ్యాక్ అయి పేపర్ బయటకు వచ్చినా.. దేశవ్యాప్తంగా ఉన్న 20 నుండి 25 లక్షల మంది విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అంతేకాకుండా, రాష్ట్రాల విద్యా బోర్డుల స్వయంప్రతిపత్తి దెబ్బతిని, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ప్రభుత్వాల కళ్లు తెరిపించడానికి, వ్యవస్థాగత సంస్కరణలు సాధించడానికి ఉపయోగపడాలి. కానీ, ఆ నిరసనలు ప్రజా ఆస్తుల విధ్వంసానికి, హింసకు దారితీస్తే అది అరాచకత్వానికి దారితీసి, అసలు ఆశయానికే విఘాతం కలిగిస్తుంది.ప్రస్తుతం యువత జరుపుతున్న కాక్రోచ్ ఆందోళనలను , నీట్ నిరసనలను ప్రతిపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ వంటి పార్టీలు పూర్తిగా తమ రాజకీయ లబ్ధి కోసం హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇది ఉద్యమ స్వభావాన్ని రాజకీయం గా మార్చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సుదీర్ఘ పాలన కాలంలో ఏ రకమైన అవినీతి, వ్యూహాత్మక లోపాలు, ప్రశ్నాపత్రాల కుంభకోణాలు జరిగాయో దేశంలో మధ్య వయస్సులో ఉన్న ప్రతి పౌరుడికీ స్పష్టంగా తెలుసు. నాటి యూపీఏ హయాంలో వెలుగుచూసిన దారుణాలు దేశం ఇంకా మరచిపోలేదు.హింసకు, రాజకీయ హైజాకింగ్‌లకు తావివ్వకుండా, ప్రజాస్వామ్య గీత దాటకుండా సాగే వైజ్ఞానిక, చట్టబద్ధమైన పోరాటాలే ఎంతటి మొండి ప్రభుత్వాల మెడలనైనా వంచుతాయి. సమగ్రమైన, శాశ్వతమైన విద్యా సంస్కరణలకు తిరుగులేని బాటలు వేస్తాయి. రాజకీయనాయకుల స్వార్థానికి, అవినీతి ముఠాల అక్రమార్జనకు లక్షలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కన్నీళ్లు, నిరుద్యోగుల నిరాశ బలికాకూడదంటే ప్రతి ప్రశ్నా ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలి.ప్రశ్నించే గొంతుకలకు స్పష్టమైన కార్యాచరణ తోడైనప్పుడే పాలకులు దిగివస్తారు. రాజకీయాల రంగు పడకుండా, చట్టసభలు చుట్టుముట్టేలా యువత తెచ్చే ఈ మేధో సంచలనమే రాబోయే రోజుల్లో వ్యవస్థలకు అసలైన దిశానిర్దేశం చేస్తుంది. పారదర్శకతకు పట్టంకడుతూ, పేపర్ లీకేజీలు లేని స్వచ్ఛమైన సమర్థ భారత్ ను నిర్మించుకోవడమే మన విద్యా వ్యవస్థకు, కష్టపడే ప్రతిభావంతులైన యువతకు మన సమాజం అందించే అత్యున్నతమైన, అసలైన గౌరవం!

# మహోగ్రంగా బ్రహ్మపుత్ర!



దేశంలో అనేక ప్రాంతాలు వాన జాడలేక ఇబ్బంది పడుతుంటే అస్సాం ఎప్పట్లానే వరద నీటిలో తేలియాడుతోంది. బ్రహ్మపుత్ర నది మహోగ్రరూపం దాల్చి విరుచుకుపడటంతో జనావాసాల్లోకి వరద నీరు ప్రవేశించి 9 లక్షలమందికిపైగా జనం ఇళ్లూ వాకిళ్లూ వదిలి పోవాల్సివచ్చింది. ఇంతవరకూ 47 మంది మరణించగా, దాదాపు 25,000 హెక్టార్ల పంట నీట మునిగింది. మొత్తంగా 11 జిల్లాలు వరదలతో దెబ్బతినగా, శివసాగర్, జోర్హాట్, దిబ్రూగఢ్, చారైదేవ్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. హిమాలయా ల్లోని కైలాసశిఖరిలో పుట్టి, ప్రపంచంలోని అతి ఎత్తయిన ప్రాంతంలో పెను వేగంతో ప్రవహిస్తూ అటు తర్వాత అస్సాం మైదాన ప్రాంతాలకు ఆ నది చేరుతుంది. అక్కడ వేగం తగ్గినా అప్పటికే అది ఒండ్రుమట్టినీ, బురదనూ పోగేసుకొస్తుంది.

ప్రపంచంలోని ఏ నదితో పోల్చినా అది తీసుకొచ్చే ఒండ్రుమట్టి, బురద పరిమాణం చాలా ఎక్కువ. ఇదంతా నదీ ప్రవాహ క్రమంలో ఎక్కడికక్కడ మేటలేస్తూ వస్తుంది. కాలం గడిచేకొద్దీ ప్రవాహమార్గం ఇరుకై ఆ నది దారి మార్చుకోవటం మొదలుపెడుతుంది. అందుకే బ్రహ్మపుత్రను స్థానికులు వలస నది అంటారు. ఎగువ ప్రాంతాల్లో దట్టమైన మేఘాలు ఒక్కసారిగా విరుచుకుపడటం పర్యవసానంగా కుంభవృష్టి, మంచు పర్వతాలు కరిగి పోవటం, భారీ వర్షాలు పడటం అస్సాంకు రివాజు. ఈసారి మేఘాలయ తదితరప్రాంతాల్లో పడిన భారీవర్షాలు వరదలకు కారణమయ్యాయి.

బ్రహ్మపుత్ర పరివాహ ప్రాంతం దేశాలూ, రాష్ట్రాలూ దాటి విస్తరించివుంది. ఇది ప్రకృతి శాపమని, ఇందులో మనిషి నిమిత్తమాత్రుడని చెప్పే మాటల్లో నిజం లేదు. వేరే దేశాల సంగతి వదిలి, కనీసం నదీపరివాహ రాష్ట్రాలన్నీ కలసికట్టుగా దృష్టి పెడితే బ్రహ్మపుత్ర కలగజేసే నష్టాన్ని పరిమిత స్థాయికి కుదించవచ్చు. ఇందుకు భిన్నంగా దాన్ని కేవలం ఒక రాష్ట్రానికి చెందిన సమస్యగా పరిగణించటమే చివరికి కష్టనష్టాలన్నీ అస్సాం భరించాల్సివస్తోంది. వరదల్ని కట్టడిచేసేందుకు కరకట్టల నిర్మాణమే సరైందని ఆరాష్ట్రం అనుకుంటోంది. దశాబ్దాలుగా వాటిపైనే కేంద్రీకరిస్తోంది. కానీ నదీ గమనం మారినప్పుడల్లా ఈ కరకట్టలు నిరుపయోగమవుతున్నాయి. పూడికతీత ప్రధాన సమస్యగా మారుతున్నప్పుడు బురద నియంత్రణ విషయంలో ఏం చేయాలన్నప్రశ్న రావాలి.

అస్సాం ముఖ్యమంత్రి హిమంతా బిశ్వ శర్మ చెప్పినట్టు ఇది కనీవినీ ఎరుగని ఉత్పాతం. ఆ రాష్ట్రానికి ఏటా వరదలు రివాజే అయినా, ఈసారి ముంచెత్తినంత వరద యాభైయ్యేళ్లలో ఎప్పుడూ లేదు. కానీ సహాయ చర్యలు ఏమంత సజావుగా లేవు. వరద ప్రభావం అధికంగా గల శివసాగర్ జిల్లా మొత్తానికి కేవలం 5 బోట్లు మాత్రమే కేటాయించారు. అధికార యంత్రాంగంనుంచి ముందస్తు హెచ్చరికలు లేకపోవటంవల్ల పశువుల్ని రక్షించుకోవటమైనా, తాము సురక్షిత ప్రాంతాలకు తరలడమైనా జనానికి కష్టమై పోయింది. చుట్టూ సముద్రాన్ని తలపించేలా నీరుంటే, అనేకులు పైకప్పులెక్కి నిస్సహా యంగా చూస్తూ ఉండాల్సివచ్చింది. ఆహారం, నీరు అందించటంలోనూ అధికారులు అలసత్వం ప్రదర్శించారన్నది స్థానికుల ఆరోపణ. మొత్తం 872 గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగి దీవుల్ని తలపిస్తున్నాయంటే ఈ తీవ్రత ఎంతగా ఉందో తెలుస్తుంది. అడవుల పరిరక్షణ, అడవుల పెంపకం వంటివి అత్యంత కీలకమైన ప్రాథమిక రక్షణ కవచాలుగా తోడ్పడతాయి. కేవలం అవి మాత్రమే సంపూర్ణంగా నియంత్రిస్తాయను కోవటం సరైంది కాకపోయినా, నదీ పరివాహ ప్రాంతంలో ఉండే పర్వత శిఖరాల్లో దట్టమైన అడవులుంటే చెట్ల వేళ్లు మట్టిని గట్టిగా పట్టి ఉంచటంవల్ల కొండచరియలు విరగటం, వర్షపు నీటితోపాటు మట్టి కొట్టుకుపోవటం తగ్గుతుంది. హిమాలయాలు భూకంప ప్రభావిత జోన్‌లో ఉండటంవల్ల ఆ ప్రాంతంలోని కొండలు అత్యంత బలహీనమైన నాణ్యత కలిగిన మట్టి, రాళ్లతో నిండి ఉంటాయి. నదీ తీరం పొడవునా వెదురు, గడ్డి జాతుల మొక్కల పెంపకంవల్ల కోతను అరికట్టడం సాధ్యమవుతుంది. ఎన్ని చేసినా తాత్కాలిక ఉపశమనానికీ, నష్టాన్ని నియంత్రించటానికీ మాత్రమే అవి తోడ్పడ తాయి. మనం చేయాల్సిందల్లా పర్యావరణ విధ్వంసాన్ని అరికట్టడం. దాన్ని విస్మరించి చేసే ఏ చర్య అయినా మెరుగైన ఫలితాన్నివ్వలేదు.

# ఆర్గానిక్ బాటలో జగన్

డిజిటల్ ప్రపంచంలో పెయిడ్ ట్రాఫిక్ కోసం చాలా మంది డబ్బులు కడుతూంటారు. తమ పోస్టులకు రీచ్ రావడానికి.. తాము చేసే ప్రకటనల్ని ఎక్కువ మంది చూడటానికి.. తమ వీడియోలను ఎక్కువ మంది చూడటానికి డబ్బులు కడుతూంటారు. అయితే నిజానికి అలా కట్టడం వల్ల ఎక్కువ మంది చూడరు. నెంబర్స్ మాత్రమే కనిపిస్తాయి. అంటే ప్రయోజనం కనిపిస్తుంది కానీ.. పనికి రాదు. జగన్ రెడ్డి కూడా అదే మార్క్ రాజకీయాలు చేస్తున్నారు. పూర్తిగా పెయిన్ పాలిటిక్స్ చేస్తూ?ఆర్గానిక్ బాటను మర్చిపోయారు.రాజకీయ నాయకుడు ఏదైనా కార్యక్రమం చేస్తే ప్రజల భాగస్వామ్యం ఉండేలా చేసుకోవాలి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన, సహజమైన సమస్యలను పట్టుకుని బాధితుల మధ్యకు వెళ్తున్నప్పుడు వారిని కలవాలి. కానీ జగన్ రెడ్డి ఆ సమస్య పేరుతో తాను ఓ డ్రామా సృష్టించుకుని దానిలో నటించి వెళ్లిపోతారు. సమస్య ఏదైనా సరే, దాని చుట్టూ కొంతమంది నేతలతో ఒక ఆర్టిఫిషియల్ డ్రామా నడిపిస్తే చాలు రాజకీయం చేయవచ్చని జగన్ భావిస్తున్నారని, కానీ ఈ వ్యూహం ప్రజల్లో ఆయన నమ్మకాన్ని మరింత దిగజారుస్తోంది.ఇటీవల అక్వా రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారంటూ వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హడావుడి చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో అక్వా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినకుండా.. ఫేక్ సభ పెట్టి .. పార్టీ నేతలతో మాట్లాడి డ్రామా పాలిటిక్స్ చేశారు. ఈ పోరాటం ఏ ఒక్క అసలైన అక్వా రైతునూ కదిలించలేకపోయింది. ఇప్పుడు అదే తరహా మైండ్ గేమ్ పొగాకు రైతుల విషయంలోనూ పునరావృతమవుతోంది. అసలైన రైతులతో కనెక్ట్ కాకుండా, కేవలం కెమెరాల ముందూ, ముందస్తుగా సిద్ధం చేసిన స్క్రిప్ట్‌ల చుట్టూ రాజకీయాలు నడపడం వల్ల ప్రతిపక్షంగా సాధించే ప్రయోజనమేమీ లేకుండా పోతోంది.ఈ శైలి వెనుక జగన్ ఎదుర్కొంటున్న ఓ రకమైన ఆత్మన్యూనతా భావం ఉంది. తాను బయటకు వెళ్తే జనాలు రారేమో, భద్రత లేదా ఆదరణ విషయంలో వ్యతిరేక సంకేతాలు వెళ్తాయేమో అనే ముందస్తు భయంతోనే ఆయన కృత్రిమ వాతావరణాన్ని, సొంత పార్టీ క్యాడర్‌తో సభలను ఏర్పాటు చేసుకుని రాజకీయం మమేకం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రజాకర్షణ ఉన్న నాయకుడిగా పేరొందిన జగన్.. ఇలా ఆర్టిఫిషియల్ పరిమితులకు పరిమితం కావడం వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి వంటి సలహాదారుల బ్రెయిన్ వాష్ ప్రభావం చాలా ఉందనేది సొంత పార్టీ నేతల ఆవేదన.

# నిత్య చైతన్యమే అస్తిత్వానికి శ్రీరామ రక్ష

అస్తిత్వం, ఐడెంటిటీ, ఉనికి, గుర్తింపు ఏవైనా కొద్దిపాటి తేడాలతో అన్నీ సమానార్థకాలే. తెలంగాణ అస్తిత్వం వెనుక ఉన్న చారిత్రక, రాజకీయ నేపథ్యాన్ని నిరంతరం గుర్తుచేసుకోవడం ఎంత ముఖ్యమో, దాన్ని కాపాడుకోవడానికి ఎల్లప్పుడూ జాగృతంగా, చైతన్యంగా ఉండటం కూడా అంతకంటే ముఖ్యం. తెలంగాణ చరిత్రలో మూడు ప్రధాన ఉద్యమ ఘట్టాలు కనిపిస్తాయి. 1952 నుంచి 1956 వరకు జరిగిన గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం. అది హైదరాబాద్ స్టేట్ ఉన్నప్పుడు మొదటి ముల్కీ ఉద్యమం. ఆ తర్వాత 1969లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పెద్ద ఎత్తున ఉద్యమం వచ్చింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన ఆ ఉద్యమంలో 369 మంది అమరులయ్యారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన మలిదశ ఉద్యమం. అది చాలా శాంతియుతంగా జరిగిన పోరాటం. అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మనవాళ్లలో కొందరికి కొంత ఆరామీ- సుకూన్ స్వభావం లేదా 'కామ్ హోగయ చలో' అన్న స్వభావం చోటు చేసుకుంది. 'తెలంగాణ వచ్చేసింది కదా, ఇంకేం కాదులే' అనే నిర్లిప్తత ఆవహించింది. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆ ఆరామీ-సుకూన్ స్వభావం మనల్ని ఎంత ప్రమాదకరమైన స్థితికి తీసుకెళ్లిందో కనిపిస్తున్నది. గతంలో ఏం జరిగిందనేది ఎంత ముఖ్యమో, వర్తమానంలో ఏం జరుగుతున్నది? మనం ఎంత యాక్టివ్‌గా ఉన్నాం? అనేది భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఇప్పుడు నిమ్మళంగా ఉంటే, భవిష్యత్తు అగమ్య గోచరమై మొదటికొచ్చి 'వైకుంఠపాళిలో పెద్ద పాము మింగినట్టు' వెనక్కి పడిపోతాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యాలు ఉన్నాయి. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంలో నీళ్లకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులు జరిగాయి. ఉద్యోగాల విషయంలో కూడా 95 శాతం స్థానికులకే వచ్చేలా మార్పులు జరిగాయి. అయినప్పటికీ, ఎక్కడ లోటు జరిగింది అంటే.. తెలంగాణ అస్తిత్వాన్ని, దాని సామాజిక-సాంస్కృతిక వారసత్వాన్ని ఎలా రక్షించుకోవాలనే ప్రణాళికను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లలేకపోయాం. బతుకమ్మ పండుగను అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి అంతర్జాతీయ వేదికల వరకు తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించినప్పటికీ, కేవలం ఆటాపాటలతోనే అస్తిత్వ రక్షణ జరుగదు. ఇప్పుడు మళ్లీ పాత శక్తులు తలలెత్తుతున్నాయి. ఉద్యమ కాలంలో ప్రతి విషయంపైనా ఎంతో క్లారిటీ ఉండేది. కానీ నేడు 'తెలంగాణ ఎక్కడుంది? తెలంగాణ అస్తిత్వం ఎక్కడుంది?' అని ప్రశ్నించే పరిస్థితి తెస్తున్నారు. ఒకవైపు తెలంగాణలోనూ టీడీపీని బలోపేతం చేస్తామని నారా లోకేశ్ అంటుంటే, మరోవైపు పవన్ కల్యాణ్ లాంటి విచిత్రమైన వ్యక్తి ఇక్కడి అస్తిత్వాన్ని సవాల్ చేస్తున్నడు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి వైఖరిలోనూ ఇటువంటి నాటకాలే కనిపిస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరందరికీ ఇక్కడ స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయి. ఆంధ్రా ప్రాంత పెట్టుబడిదారులకు, సరిహద్దు ప్రాంతాల వారికి, హైదరాబాద్‌లోనే ఎకరాల భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, హోటల్ బిజినెస్, సినిమా ఇండస్ట్రీ వంటి వ్యాపారాలు ఉన్నవారి ప్రయోజనాలను రక్షించుకోవడానికే వారు తెలంగాణ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ఈ వ్యూహాల వెనుక స్పష్టమైన కుట్ర దాగి ఉన్నది. 'చేపలను పట్టాలంటే మొదట నీటిని కదల్చాలి' తెలంగాణలో భావోద్వేగాలను రెచ్చగొట్టి, హింసను ప్రేరేపించి, తద్వారా ఇక్కడి ప్రాంతీయ శక్తులను (బీఆర్ఎస్‌ను) అణచివేయాలని చూస్తున్నారు. దీని వెనుక నరేంద్రమోదీ డైరెక్షన్ ఉంటే, దానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్ బహిరంగ మద్దతు ఇస్తే రేవంత్‌రెడ్డి సైలెంట్‌గా మద్దతు ఇస్తున్నడు. రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి తన వర్గంతో కలిసి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ నలుగురి, దుష్ట చతుష్టయం, (మోడీ, చంద్రబాబు, పవన్, రేవంత్) కూటమి తెలంగాణ అస్తిత్వంపై నిశ్శబ్దంగా కుట్రలు చేస్తున్నది. నిన్నటివరకు క్యూబా విప్లవకారుడు చేగువేరా లా మాట్లాడిన పవన్ కళ్యాణ్, నేడు సనాతన ధర్మం అంటూ కాషాయ వస్త్రాలు వేసుకోవడం వారి అవకాశవాదానికి, చిత్ర-విచిత్రమైన రాజకీయ ప్రదర్శనలకు నిదర్శనం. ఇలాంటి శక్తులకు కేవలం ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలి, ఒక్క ఓటు కూడా పడకుండా తిరస్కరించాలి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్లిష్ట సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలు మాని నీళ్లను ఎత్తిపోయాలని సాగునీటి నిపుణులు, రిటైర్డ్ ఇంజినీర్లు, రైతాంగం, ప్రధానప్రతిపక్షం బీఆర్ఎస్ విజ్ఞప్తి చేస్తున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ మొండిగా వ్యవహరిస్తున్నది. ఆ ప్రాజెక్టుపై ఎన్నికల ముందు చేసిన అసత్య ప్రచారాలనే ఇంకా కొనసాగిస్తున్నది. మోటర్లు ఆన్ చేసి నీళ్లను ఎత్తిపోస్తే వచ్చే నష్టమేమీ లేదని రిటైర్డ్ ఇంజినీర్లు సూచిస్తే వాళ్లపై, విపక్ష పార్టీ నేతలపై పాలకులు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు మెప్పు కోసం ఇదంతా చేస్తున్నారని అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ అనేది నిన్న మొన్న పుట్టిన పదం కాదు. దీనికి మూడు వేల ఏండ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్నది. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ 'తెల్లాపూర్ శాసనం' లోని స్తంభంపై మొట్టమొదటిసారిగా 'తెలంగాణ' అనే పదం లిఖితపూర్వకంగా చెక్కబడింది. అంతకంటే ముందు, భారతదేశంలోని 16 మహాజన పదాలలో (షోడశ జనపదాలు) ఒకటైన 'అస్మక జనపదం' గోదావరి లోయ ప్రాంతంలోనే విలసిల్లింది. నేటి బోధన్ (పోతలి) దీనికి రాజధానిగా ఉండేది. అలాగే మెట్‌పల్లి-ఖానాపూర్ మధ్య గోదావరి నది ఏడు పాయలుగా చీలే చోట ఉన్న 'బాదనకుర్తి' (బాదనగుర్తి) ద్వీప గ్రామానికి అపారమైన బౌద్ధ చరిత్ర ఉంది. శాతవాహనుల కాలంలో భావరి అనే ఋషి తన శిష్యులను ఇక్కడి నుంచే బుద్ధుని వద్దకు పంపినట్లు ఆధారాలు ఉన్నాయి. ఇంతటి ఘన చరిత్ర ఉన్న తెలంగాణ అస్తిత్వాన్ని ఎవరో వలసవాదులు లేదన్నంత మాత్రాన అది చెరిగిపోదు. రాష్ట్రంలో 30 నెలలుగా పరిణామాలన్నీ చూసిన తర్వాత ఆంధ్రా పెత్తందార్ల, వలసవాదుల కుట్రలను తిప్పికొట్టడానికి తెలంగాణ పౌర సమాజం మళ్లీ సంఘటితం కావాలి. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న అస్తిత్వ వేదిక, సోషల్ ఫౌండేషన్ వంటి వాటిని వేదికలుగా చేసుకొని ప్రజలు కలిసికట్టుగా పోరాడాలి. ప్రతి ప్రాంతానికి, సమాజానికి ఒక సామూహిక మనస్తత్వం ఉంటుంది.

# నీట్‌ను పట్టించుకోని తెలుగు ప్రాంతీయ పార్టీలు



**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, కేంద్ర ప్రభుత్వ విద్యారంగ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు మిన్నంటుతున్నా, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్ , వైఎస్సార్‌సీపీ అనూహ్యంగా మౌనం వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ , వివిధ విద్యార్థి సంఘాలు రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్నప్పటికీ, ఈ రెండు ప్రాంతీయ పార్టీలు మాత్రం క్రియాశీలక పోరాటాలకు దూరంగా ఉంటున్నాయి. యువత , విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశంపై ఈ రెండు పార్టీల మౌనం రాజకీయంగా పలు అనుమానాలకు తావిస్తోంది.సాధారణంగా ప్రతిపక్షాలకు యువత, విద్యార్థి వర్గాల మద్దతును పొందేందుకు ఇలాంటి జాతీయ స్థాయి వివాదాలు ఒక పెద్ద ఆయుధంగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా బీజేపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రాంతీయ పార్టీలు ముందంజలో ఉండాలి. కానీ, తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ రెండూ కూడా జాతీయ స్థాయిలో విపక్షాల కూటమి పిలుపునిచ్చిన నిరసనలకు భౌతికంగా, ఉధృతంగా మద్దతు తెలపకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహంతో పాటు కేంద్రం పట్ల ఉన్న భయాందోళనలే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందిగ్ధ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నాయకత్వం పట్ల ఈ పార్టీలకున్న వినూత్నమైన అభద్రత. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత, అసెంబ్లీ ఓటమి అనంతరం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు బీజేపీతో అనధికారికంగా ఒక వ్యూహాత్మక శాంతి ని పాటిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాన్ని లేదా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను నేరుగా టార్గెట్ చేస్తే టీఎంసీ లాంటి పరిస్థితులు రావొచ్చని సందేహిస్తున్నారు. అటు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఏపీలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలో ఉంది. గత ఐదేళ్ల పాలనపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు విచారణలకు ఆదేశిస్తున్న తరుణంలో, కేంద్రంలోని బీజేపీ పెద్దల ఆగ్రహానికి గురైతే పార్టీ మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. అందువల్లనే, కేంద్ర విద్యాశాఖ , మోదీ ప్రభుత్వాన్ని విమర్శించే విషయంలో వైఎస్సార్‌సీపీ చాలా అప్రమత్తంగా, పరిమిత వ్యాఖ్యలకే పరిమితమవుతూ, వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు వెనుకాడుతోంది. విద్యార్థుల భవిష్యత్తు ఎటుపోయినా పర్వాలేదు కానీ, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు మాత్రం కేంద్రాన్ని ప్రశ్నించరు అంటూ రేవంత్ రెడ్డి టార్గెట్ చేస్తుండటంతో, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది. తమ స్వయంకృత అపరాధాల వల్ల వచ్చిన కేసుల భయంతోనే బీఆర్ఎస్ నోరు మెదపడం లేదని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అందుకే మొక్కుబడిగా జంతర్, మంతర్ దగ్గర బీఆర్ఎస్వీతో నిరసనలు చేయిస్తామని ప్రకటించారు. సుదీర్ఘ కాలంలో ఈ తరహా మౌనం ప్రాంతీయ పార్టీలకు పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది. రాబోయే కాలంలో నిరుద్యోగిత, విద్యార్థుల సమస్యలు, రిక్రూట్‌మెంట్లు ప్రధాన రాజకీయ అంశాలుగా మారబోతున్న తరుణంలో, యువతకు అండగా నిలవాల్సిన ప్రతిపక్షాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఇది కాంగ్రెస్‌కు విద్యార్థి, యువజన ఓటు బ్యాంకును మరింత బదిలీ చేసేందుకు దోహదపడుతోంది. కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం పట్ల ఉన్న భయం, రాజకీయంగా వ్యూహాత్మకంగా సైలెంట్‌గా ఉండాలనే నిర్ణయం వల్లనే బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీలు జాతీయ స్థాయి ఆందోళనలకు దూరంగా ఉంటున్నాయి. ఈ వ్యూహం ప్రస్తుతానికి తమపై కేంద్ర సంస్థల దాడులు పడకుండా కాపాడుకోవడానికి ఉపయోగపడవచ్చు ఏమో కానీ, క్షేత్రస్థాయిలో విద్యార్థులను, యువత మద్దతు కోల్పోయే ప్రమాదాన్ని ఈ ప్రాంతీయ పార్టీలు స్వయంగా తెచ్చిపెట్టుకుంటున్నాయని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# 29 నుంచి 45కు పెరగనున్న సిటీ అసెంబ్లీ సీట్లు



**హైదరాబాద్ :** తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అమల్లోకి వస్తే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న 119 శాసనసభ స్థానాల సంఖ్య ఏకంగా 179 వరకు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాజ్యాంగ నిబంధనలు, జనాభా లెక్కల ప్రాతిపదికన ప్రతి నియోజకవర్గానికి సగటున 1.95 లక్షల జనాభాను ప్రామాణికంగా తీసుకుంటే.. ఈ ప్రక్రియలో అత్యధికంగా లబ్ధి పొందేది, సీట్లను అదనంగా సాధించుకునేది గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉండే మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలే కానున్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలు విపరీతంగా విస్తరించడం వల్ల గ్రామీణ ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి నగరానికి వలసలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఆరు నుంచి ఏడు లక్షలు దాటిపోయింది. మిగతా జిల్లాల్లోని ఒక సాధారణ నియోజకవర్గంలో 2 నుంచి 2.5 లక్షల ఓటర్లు ఉంటే, హైదరాబాద్ అర్బన్ కారిడార్‌లోని ఒక్కో స్థానంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండాల్సినంత జనాభా కేంద్రీకృతమైంది. ఈ వ్యత్యాసాన్ని సరిదిద్దడమే డిలిమిటేషన్ ప్రధాన లక్ష్యం కానుంది.అంచనాల ప్రకారం.. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల ఉమ్మడి అసెంబ్లీ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 29 నుంచి ఏకంగా 45కిపైగా పెరిగే అవకాశముంది. పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, మేడ్చల్, కూకట్‌పల్లి, మహేశ్వరం వంటి అతిపెద్ద నియోజకవర్గాలను రెండు లేదా మూడు కొత్త సీట్లుగా విభజిస్తారు. దీనివల్ల కేవలం గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల అర్బన్ పరిధిలోనే దాదాపు 16 నుంచి 20 కొత్త అసెంబ్లీ స్థానాలు పుట్టుకొస్తాయి. అంటే, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా గ్రామీణ ప్రాంతాల కంటే ఈ గ్రేటర్ బెల్ట్ సీట్లే అత్యంత కీలకం కానున్నాయి.ఈ స్థానాల పెంపు ఏ పార్టీకి రాజకీయంగా అడ్వాంటేజ్ ఇస్తుందనేది ఇప్పుడు అసలు సిసలైన చర్చ. నగర ఓటర్లలో మధ్యతరగతి, ఐటీ ఉద్యోగులు, ఆంధ్రా మూలాలున్న సెటిలర్లు, ఉత్తరాది వలసదారులు ఎక్కువగా ఉంటారు. చారిత్రాత్మకంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు మైగ్రెంట్స్ ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో బిజెపి , బిఆర్ఎస్ పార్టీలకు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. డిలిమిటేషన్ వల్ల నగర సీట్లు పెరిగితే అర్బన్ క్లాస్, సెటిలర్ ఓటర్ల ప్రభావం మరింత పెరిగి బీజేపీ, బీఆర్ఎస్‌లకు కలిసివచ్చే అవకాశాలు ఎక్కువ . మరోవైపు, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం గ్రామీణ తెలంగాణలో అత్యంత బలంగా ఉండి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తక్కువ స్థానాలను కలిగి ఉంది. కాబట్టి అర్బన్ సీట్లు భారీగా పెరిగితే కాంగ్రెస్ తన రాజకీయ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వస్తుంది. కాంగ్రెస్ గ్రామీణ ఓటు బ్యాంకును మాత్రమే నమ్ముకుంటే సరిపోదని, నగర నియోజక వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఈ కొత్త సమీకరణాలు స్పష్టం చేస్తున్నాయి. రూరల్ నియోజకవర్గాల్లో కూడా జనాభా ప్రకారం కొత్త స్థానాలు ఏర్పడతాయి కాబట్టి అక్కడ తులనాత్మకంగా కాంగ్రెస్‌కు పట్టు సాధించే వెసులు బాటు కూడా ఉంటుంది.రాబోయే డిలిమిటేషన్ తెలంగాణ పొలిటికల్ పవర్ సెంటర్‌ను రూరల్ కారిడార్ నుంచి అర్బన్ కారిడార్‌కు మళ్లించబోతోంది. ఏ పార్టీ అయితే గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తున్న నూతన నియోజకవర్గాల్లో పట్టు సాధిస్తుందో, ఆ పార్టీకే రాష్ట్రంలో అధికార పీఠం దక్కే అవకా శాలు మెరుగ్గా ఉంటాయి. సామాజిక సమీకరణాలు, వలస దారుల ప్రభావం, ఐటీ–రియల్ ఎస్టేట్ రంగాల విస్తరణే రేపటి తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి.

# భారీగా పెరగనున్న ఆస్తి పన్ను...




**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని భవనాలు, స్థలాల యజమానులకు ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆస్తిపన్ను అసెస్మెంట్ విధానంలో మార్పులు తీసుకువస్తూ పాలకవర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సాంప్రదాయ అద్దె ప్రాతిపదికన కాకుండా.. మార్కెట్ రేట్లకు అనుగుణంగా పన్నులు వసూలు చేసేందుకు వీలుగా కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే.. పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులపై పన్ను భారం ఊహించని రీతిలో పెరగనుంది. హైదరాబాద్ నగరంలోని ఇళ్ల, వాణిజ్య సముదాయాల యజమానులపై ఆర్థిక భారం పెరగనుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి స్వస్తి పలికి.. దానికి బదులుగా క్యాపిటల్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును నిర్ణయించేందుకు ప్రభుత్వం సమగ్ర అర్బన్ రిఫార్మ్స్ (సీయూఆర్ఈ) ముసాయిదా బిల్లులో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ నూతన సంస్కరణల వల్ల నగర పరిధిలోని నివాసాల యజమానులతో పాటు వాణిజ్య సముదాయాల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.కొత్తగా తీసుకురానున్న 'క్యూర్' ముసాయిదా బిల్లు ప్రకారం.. ఆస్తిపన్ను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే భూమి, భవనాల క్యాపిటల్ విలువనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకోనున్నారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగానికి అనుగుణంగా మార్కెట్లో భూముల ధరలు, భవనాల విలువలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటాయి. దీనివల్ల పన్ను శాతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచకపోయినా, భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను కూడా ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా పెరుగుతూ పోతుంది.ఈ కొత్త ముసాయిదా చట్టంలో ఆస్తుల రకాన్ని బట్టి పన్ను శాతాలను ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇళ్లకు సంబంధించి క్యాపిటల్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు పన్ను స్లాబ్‌లను వర్తింపజేయాలని ప్రతిపాదించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సంబంధించి క్యాపిటల్ విలువలో 0.20 శాతం నుంచి గరిష్టంగా 2.00 శాతం వరకు పన్ను స్లాబ్‌లను విధించనున్నట్లు స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదిత విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే నగరంలో ఆస్తులు ఉన్న వారిపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశం ఉంది. పెరుగుతున్న భూముల రేట్లకు అనుగుణంగా ఏటా పన్ను పెరిగే నిబంధన ఉండటంతో.. భవిష్యత్తులో పన్ను భారం మరింత పెరగనుందని స్పష్టం అవుతోంది. అది జరిగితే యజమానులు తమపై పడే పన్ను భారాన్ని అద్దెలు పెంచడం ద్వారా పూడ్చుకోవడానికి ప్రయత్నిస్తారు. దీని వల్ల అంతిమంగా భారం అద్దెదారులపైనే పడే అవకాశం ఉంటుంది.

## బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్...

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను మరోసారి రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా స్కెచ్ వేసింది. నగర నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ పేరుతో రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ. 6 లక్షలకే ఇస్తామంటూ సరికొత్త సెంటిమెంట్ రగిలిస్తోంది. రూ. 5 లక్షల సబ్సిడీ, రిజర్వేషన్ల శాతం, మీ–సేవ దరఖాస్తులు అంటూ సుదీర్ఘమైన నిబంధనల జాబితాను ప్రకటిస్తూ.. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ స్కీమ్ తెరపైకి తెచ్చారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.గతంలో కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి, లక్షలాది మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఓట్ల పండగ ముగిశాక పేదలను నగరానికి 30–40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన అరకొర ఇళ్లకు పరిమితం చేసింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కేసీఆర్ ఫార్ములా ను కాస్త రూపుమార్చి అమలు చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఉచితం అని చెప్పకుండా.. రూ. 6 లక్షల భాగస్వామ్యం పేరుతో ప్రజల నుంచి ఆశలు రేకెత్తించి, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ఈ దరఖాస్తుల హంగామా అని ఎక్కువ మంది నమ్ముతున్నారు.ప్రస్తుతం తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ కడతామని చెబుతున్న ప్రభుత్వం, అసలు ఇళ్లకు సరిపడా భూములు ఎక్కడ ఉన్నాయో స్పష్టం చేయడం లేదు. పార్టీ చేస్తున్న విమర్శలను విష ప్రచారం అని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ నేతలు, గత ప్రభుత్వం చేసిన పాత తప్పులనే మళ్లీ పునరావృతం చేస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. మీ–సేవ కేంద్రాలు, వాట్సాప్ నంబర్లు ఇచ్చి దరఖాస్తులు తీసుకోగానే సరిపోదని, అసలు ఇళ్లు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పకుండా ఓటర్లను భ్రమల్లో ఉంచడమే కాంగ్రెస్ వ్యూహమన్న విమర్శలు ఉన్నాయి.గతంలో చూపించిన డబుల్ బెడ్‌రూమ్ డ్రీమ్ ఎలాగైతే ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారో ఇప్పుడు ఇందిరమ్మ టవర్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా పథకాన్ని అమలు చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేదవాడికి నిజంగా ఇల్లు అందుతుందా లేదా అన్నది పక్కనబెడితే.. గ్రేటర్ ఎన్నికల వేళ ఈ ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన మాత్రం హైదరాబాద్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేపుతోంది. కానీ ఇప్పటికీ కేసీఆర్ నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు చాలా వరకూ పంపిణీ కాలేదు. కొన్నింటిలో పనులు పెండింగ్ లో ఉన్నాయి.

## ప్రతి నీటి చుక్కను సంరక్షించుకోవడం

## ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత:

**ఉస్మానియా విశ్వవిద్యాలయం సైఫాబాద్ సైన్స్ కళాశాలలో వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం**




హైదరాబాద్‌లో భూగర్భ జలాలను పరిరక్షించడం, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (జలమండలి) ఆధ్వర్యంలో నిర్వహించిన వర్షపు నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఇంజెక్షన్ పాయింట్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్, హార్వెస్టింగ్ బోర్‌వెల్స్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం "ప్రతి నీటి చుక్కను సంరక్షించుకుందాం ? పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదంతో మొక్కలు నాటి, వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను కాపాడేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సైఫాబాద్ సైన్స్ కళాశాల విద్యాబోధనతో పాటు వర్షపు నీటి సంరక్షణలో ఆదర్శంగా నిలుస్తూ సమాజానికి మార్గదర్శకత్వం వహించడం అభినందనీయమన్నారు. నేటి పరిస్థితుల్లో ప్రతి వ్యవస్థ నీటిపైనే ఆధారపడి ఉందని, కురిసే వర్షపు నీటిని డ్రైనేజీల ద్వారా వృథాగా కాలువల్లోకి వెళ్లనివ్వకుండా భూగర్భ జలాల్లోకి ఇంకేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో రాతి నిర్మాణాలు, సిమెంట్ రోడ్ల విస్తరణ కారణంగా వర్షపు నీరు సహజంగా భూమిలోకి ఇంకే పరిస్థితి తగ్గిపోయిందని, అందువల్ల నగరంలోని ప్రతి ఇల్లు, ప్రతి సంస్థలో ఇంకుడు గుంతలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. నిజాం కాలం నుంచే హైదరాబాద్‌లో నీటి సంరక్షణ కోసం అనేక చెరువులు నిర్మించారని గుర్తు చేసిన మంత్రి, ఆ సంప్రదాయాన్ని ఆధునిక పద్ధతులతో కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. 2016 నుంచి హైదరాబాద్‌లో భవన నిర్మాణ అనుమతుల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థను తప్పనిసరి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత కొద్ది రోజులుగా నగరంలో రోజువారీ నీటి ట్యాంకర్ల వినియోగం సుమారు 4 వేల నుంచి 12 వేల వరకు పెరిగిందని పేర్కొంటూ, ఇది రాబోయే నెలల్లో నీటి అవసరం మరింత పెరిగే సూచనగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 3 వేల నుంచి 4 వేల వరకు బోర్‌వెల్స్ ఎండిపోయాయని, అలాంటి బోర్‌వెల్స్‌కు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఇంజెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేస్తే అవి తిరిగి నీటి నిల్వలను పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం హార్వెస్టింగ్ వ్యవస్థలను ప్రోత్సహిస్తున్నప్పటికీ ప్రజలు కూడా దీనిని తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. కృష్ణా, గోదావరి, నాగార్జునసాగర్, సింగూరు, మంజీరా, ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టుల ద్వారా రైతుల అవసరాలను సమన్వయం చేస్తూ హైదరాబాద్ నగరానికి తాగునీరు అందిస్తున్నప్పటికీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటి సంరక్షణే శాశ్వత పరిష్కారమని మంత్రి అన్నారు. 2024 అక్టోబర్ 2న రాష్ట్రంలో భారీ స్థాయిలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఈ కార్యక్రమం అమలులో రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉండగా, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకునే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. త్వరలోనే మంత్రుల నివాసాలు, కార్యాలయాలు, శాసనసభ, ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోనూ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్‌ను తప్పనిసరి చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబం తమ ఇళ్లలోనే కాకుండా బంధువులు, స్నేహితుల ఇళ్లలో కూడా హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసేలా చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ను ఒక ఉద్యమంగా, సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకోవాలని, తద్వారా భావితరాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించగలమన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విధానాన్ని అమలు చేస్తోందని, వాహనం కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ ఒక మొక్కను అందించే కార్యక్రమాన్ని కూడా ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామీణ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

మంత్రి సీతక్క

త్వరలో హ్యామ్ రహదారుల పనులు ప్రారంభిస్తాం

సచివాలయంలో హ్యామ్ (ఊంఒ) రోడ్ల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష



పట్టణ ప్రాంత రోడ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి ఆనసూయ సీతక్క స్పష్టం చేశారు. అందుకోసమే అత్యంత ఆధునికమైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (ఊంఒ) విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు. సచివాలయంలో శనివారం పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఈఎన్సీ జోగారెడ్డి, సీఈలతో కలిపి గ్రామీణ హ్యామ్ రోడ్ల నిర్మాణ పురోగతిపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూ, ప్రతి గ్రామానికి నాణ్యమైన రోడ్డు కనెక్టివిటీ ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని వెల్లడించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా హ్యామ్ మోడల్‌లో మొత్తంగా 6,703 గ్రామాల్లో 18,472 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. అందులో మొదటి విడత కింద 2,678 గ్రామాల్లో 7,450 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణ, పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మొదటి విడుతలో 90 శాతం పనులు ప్రస్తుతం ఉన్న రహదారుల ఆదునీకరణ పనులకే ప్రధాన్యమిస్తున్నామని వెల్లడించారు. దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేని 179 గ్రామాలకు తొలిసారిగా 934 కిలోమీటర్ల మేర బిటి, సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న హ్యామ్ విధానాన్ని దేశమంతా ఆసక్తిగా పరిశీలిస్తున్నందున మార్గదర్శకాలను అత్యంత సమగ్రంగా రూపొందించామని మంత్రి స్పష్టం చేశారు. ఆర్బీఐ అనుమతుల వచ్చే వారంలోగా పూర్తి స్థాయిలో రానున్నాయని, ఆగస్టు 15 నాటికి కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్రిమెంట్లు కాగానే కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించాలని, టెండర్లు దక్కించుకోవడంలో చూపిన ఉత్సాహం పనులు పూర్తి చేయడంలోనూ చూపాలని స్పష్టం చేశారు. పనులను సొంత బాధ్యతగా స్వీకరించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గతంలో సింగిల్ రోడ్డు ఉన్న చోట కూడా ఇప్పుడు భారీ వాహనాలు వెళ్లేలా నాణ్యతతో రోడ్లను నిర్మించాలని తెలిపారు. పనుల్లో ఆలస్యం లేకుండా భూసమీకరణ, చెట్ల తొలగింపు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లకు తక్షణమే సర్క్యులర్ జారీ చేయాలన్నారు. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని, అటవీ భూములు ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సమస్యలను స్థానిక అధికారుల సహాయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని కాంట్రాక్టర్లకు మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

## నల్లగొండ పట్టణ ప్రగతిలో మరో కీలక ముందడుగు

నార్కట్‌పల్లి – అద్దంకి – మేదరమెట్ల రహదారిపై మర్రిగూడ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో నల్లగొండ పట్టణవాసులతో పాటు, ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మర్రిగూడ జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రజలకు సురక్షితమైన అలాగే వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుంది. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనడానికి ఈ ప్రాజెక్టు ఒక ప్రత్యక్ష నిదర్శనం. రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా నల్లగొండ ప్రాంత ఆర్థిక మరియు వాణిజ్య వృద్ధికి ఈ నూతన ఫ్లైఓవర్ రహదారిని సుగమం చేస్తుంది. ఈ అభివృద్ధి కార్యక్రమం పట్ల ప్రాంతీయ ప్రజలు మరియు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నా

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి,

ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలి

ఎంపీ వద్దిరాజు డిమాండ్



విద్యార్థులకు బకాయిపడిన 11వేల కోట్ల రూపాయల ఫీజులను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యార్థులు,యువత ఆగ్రహావేశాలకు గురి కాకముందే వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన 11వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం శనివారం కొత్తగూడెం కమ్మ సంఘం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది.బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు,ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి,యువజన వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ ను నిరసిస్తూ విద్యార్థులు,యువత దేశవ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనకు దిగడంతో బెంబేలెత్తిన ప్రధాని నరేంద్రమోడీ మధ్య రాత్రి కూడా స్పందించారని, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని, విద్యార్థులు, నిరుద్యోగ యువత,ఉద్యోగులు, కార్మికులు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించని కారణంగా కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ బకాయిలు కూడా పెరిగిపోతున్నాయని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలంటూ యువత పోరుబాట పట్టారన్నారు.గోదావరి నీళ్లను సద్వినియోగంలోకి తేకుండా వృధాగా సముద్రం పాలవుతుంటే రేవంత్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు.రేవంత్ రెడ్డి ఎన్నికలకు 432 హామీలిచ్చి,6 గ్యారంటీలు ప్రకటించి భద్రాచలం రాముల వారితో సహా కనబడ్డ ప్రతి దేవుని మీద ఒట్లేసి, అబద్ధాలు చెప్పి, మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఎంపీ వద్దిరాజు విమర్శించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 56వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ను 3కోట్ల దాక తీసుకుపోయి అన్ని విధాలా అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ పాలకులు ఆగం పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఫీజుల బకాయిలను విడతల వారీగా చెల్లించాలని,లేనట్టయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చెల్లిస్తుందని ఎంపీ వద్దిరాజు హామీనిచ్చారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మి,మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్, రాజు గౌడ్,అనుదీప్,నవతన్,వగ్గెల పూజ, జగడం కిరణ్, రమాకాంత్, కన్నిలతో పాటు పలు విద్యార్థి, యువజన,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రాజాసింగ్‌కు దారేదీ

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కరడుగట్టిన హిందూత్వ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ భవిష్యత్తు ఇప్పుడు సస్పెన్స్‌లో ఉంది. గతంలో రాష్ట్ర నాయకత్వ ఎంపికతో పాటు పలు అంశాలపై తీవ్ర అసంతృప్తి చెంది ఆవేశంతో బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్‌కు, క్రమశిక్షణే ప్రాతిపదికగా పనిచేసే కమలం పార్టీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. ఆయన రాజీనామాను ఆమో దిస్తూ కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకోవడం, ఆయన లేవనెత్తిన అంశాలు అసంబద్ధమైనవి అని తేల్చిచెప్పడం తెలంగాణ బీజేపీలో ఆయన శకం ముగిసిందనే సంకేతాలను స్పష్టంగా పంపింది.రాజీనామా చేసిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శిం చిన రాజాసింగ్‌కు, ఆ తర్వాతి పరిణామాలతో బీజేపీని వీడడం ఎంతటి ప్రతికూల నిర్ణయమో బోధపడింది. తనకున్న హిందూత్వ రాజకీయ ఐడెంటిటీ బీజేపీతోనే ముడిపడి ఉందనే సత్యాన్ని గ్రహించిన ఆయన, మళ్లీ పార్టీలోకి చేరేందుకు రకరకాల మార్గాల్లో తీవ్రమైన లాబీయింగ్ ప్రారంభించారు. కేంద్ర పెద్దలకు విజ్ఞప్తులు పంపడం, అధిష్ఠానం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం వంటివి చేశారు. అయితే, ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి ఎదురు తిరిగి శ్రు తిమించిన వ్యాఖ్యలు చేసే రాజాసింగ్‌ను మళ్లీ వెనక్కి తీసుకునేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ఏమాత్రం సుముఖంగా లేదని స్పష్టమవుతోంది.ఇదే సమయంలో, బీజేపీ తనను పట్టించుకోకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన



రాజాసింగ్.. తన అసహనాన్ని శాపనార్థాల రూపంలో వెళ్లగక్కుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ బాగుపడదని, పార్టీని నాశనం చేస్తున్నారని విమర్శిస్తూనే మరోవైపు లోపాయికారీగా మళ్లీ ప్రవేశం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తెలంగాణలో గోషామహల్ నియోజకవర్గం మినహా రాష్ట్రవ్యాప్తంగా సొంత బలం మీద ఓట్లను ప్రభావితం చేసే స్థాయిలో రాజాసింగ్‌కు వ్యక్తిగత ఓటు బ్యాంక్, పార్టీ కేడర్ మద్దతు లేకపోవడం ఆయనకున్న అతిపెద్ద బలహీనత. ఇక్కడ ఆయనకు మరో ప్రాంతీయ పార్టీలో చేరే అవకాశం కూడా లేదు. ఈ క్రమంలోనే రాజాసింగ్ తన రాజకీయ దృష్టిని తెలంగాణ దాటి ఇతర రాష్ట్రాల వైపు మళ్లిస్తున్నట్లు రాజకీయ భావిస్తున్నారు. నేను తెలంగాణలో రాజకీయాలు చేయకపోయినా.. దేశంలో హిందూత్వ కోసం పనిచేస్తాను అని చెబుతున్నారు. తెలంగాణలో కంటే రాజాసింగ్‌కు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఉత్తరప్రదే వంటి ఉత్తరాది రాష్ట్రాల్లోని హిందూత్వ వర్గాల్లో విస్తృతమైన పాపులారిటీ, క్రియాశీల ఫాలోయింగ్ ఉంది. సకల్ హిందూ సమాజ్ నిర్వహించే పలు సభల్లో ఆయన ప్రసంగాలకు అక్కడి తీవ్ర హిందూత్వ వర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో రాజాసింగ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పలు వేదికలపై యోగి సిద్ధాంతాలను, బుల్డోజర్ మార్క్ పాలనను రాజాసింగ్ బహిరంగంగానే కొనియాడారు. యోగి అండదండలతో ఉత్తరప్రదేశ్‌లో గానీ, లేదా తన భావజా లానికి అనుకూలంగా ఉండే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గానీ బీజేపీ తరఫున ఒకవేళ అధిష్ఠానం కరుణిస్తే లేదా హిందూత్వ సంస్థల మద్దతుతో కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినా ఆశ్చర్యపోనవసరం లేదు.ఆవేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల సొంత నియోజకవర్గమైన గోషామహల్‌కే పరిమితమైన రాజాసింగ్ పరిస్థితి ప్రస్తుతం త్రిశంకు స్వర్గాన్ని తలపిస్తోంది. తెలంగాణలో తలుపులు మూసుకుపోవడంతో, తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి యూపీ, మహారాష్ట్రల రూపంలో ఆయనకు లభించే జాతీయ హిందూత్వ ఇమేజే ఏకైక శరణ్యంగా కనిపిస్తోంది. మరి యోగి ఆదిత్యనాథ్ మద్దతుతో రాజాసింగ్ జాతీయ రాజకీయ వేదికపై రీ-ఎంట్రీ ఇస్తారో లేక తెలంగాణ రాజకీయాల్లోనే మరో కొత్త వ్యూహంతో ముందుకు వస్తారో వేచి చూడాలి.

# మల్లారెడ్డి.. అంతు చిక్కని నాడి

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వైఖరి ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటుండటం, అధికార కాంగ్రెస్ నేతలతోనూ, బీజేపీ అగ్రనేతలతోనూ ఆయన జరిపిన భేటీలతో మల్లారెడ్డి పార్టీ మారడం ఖాయమనే ప్రచారం జోరుగా సాగింది. కానీ ఎప్పుడూ ఆయన బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పానని మాత్రం చెప్పలేదు. ఆ పార్టీలోనే ఉంటానని అంటూంటారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో వేడుకలు నిర్వహించి తాను ఎప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. కానీ, అక్కడ ఆయన ప్రదర్శించిన హావభావాలు, వాతావరణం చూసిన రాజకీయ విశ్లేషకులు ఇది పక్కా డబుల్ గేమ్ అని క్లారిటీకి వచ్చేశారు. కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి మెడలో గులాబీ రంగు కండువా ఉన్నప్పటికీ, దానిపై ఎలాంటి బీఆర్ఎస్ పార్టీ గుర్తులు లేవు. అంతేకాకుండా, ఆయన కార్యాలయం వద్ద సాధారణంగా కనిపించే జెండాలు, కేసీఆర్, కేటీఆర్‌ల భారీ కటౌట్లు లేకుండా కేవలం ఒక సాధారణ శుభాకాంక్షల బోర్డుతోనే సర్దేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. బీఆర్ఎస్ పార్టీని వీడే ఆలోచన లేదని పైకి చెబుతున్నా, పార్టీ చిహ్నాలను పక్కన పెట్టడం వెనుక అధిష్ఠానానికి ఒక రకమైన సిగ్నల్ ఇస్తున్నారా అనే చర్చ క్యాడర్‌లో మొదలైంది.ఈ పరిణామాలకు ముందు, మల్లారెడ్డి వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో లేఖ రాయడం పెద్ద కలకలమే రేపింది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులు, అవకాశాలు అనుభవించి.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే పార్టీకి, కార్యకర్తలకు దూరంగా ఉండటం సరికాదని సదరు కార్యకర్త ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. గులాబీ



శ్రేణుల్లో తన ప్రతిష్ట దెబ్బతింటోందని గ్రహించిన మల్లారెడ్డి, ఆ రక్తపు లేఖపై స్పందిస్తూ తనకు పార్టీ మారే ఉద్దేశం లేదని, ఆ లేఖ రాసిన కార్యకర్తను స్వయంగా కలిసి మాట్లాడతానని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.ఎటు చూసినా మల్లారెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన క్లారిటీ ఇవ్వకుండా సేఫ్ గేమ్ ఆడుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఒకవైపు పార్టీని విడిచిపెడితే వచ్చే నష్టాలను, వ్యాపార సామ్రాజ్యాలపై పడే ప్రభావాన్ని అంచనా వేస్తూనే.. మరోవైపు బీఆర్ఎస్‌లోనే ఉంటూ సొంత గుర్తులకు, జెండాలకు దూరంగా ఉండటం ద్వారా ఆయన పొలిటికల్ సేఫ్ ఎగ్జిట్ కోసం మార్గం సుగమం చేసుకుంటున్నారని భావిస్తున్నారు.ను బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు జరుగుతు ప్రచారంలో నిజం లేదన్నారు మల్లారెడ్డి. చివరివరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని.. కొంతమంది ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని.. ఎవరూ నమ్మొద్దన్నారు. తాను పార్టీ మారబోతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని నిజం అనుకుని ఓ అభిమాని రక్తంతో లేఖ పంపడం చూసి బాధపడ్డానని చెప్పుకొచ్చారు. లేఖ రాసిన కార్యకర్త ఎవరో తెలుసుకుని త్వరలోనే స్వయంగా కలిసి మాట్లాడతానన్నారు. కేటీఆర్ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని.. ఆయనకు బర్త్ డే విషెస్ తెలియజేశారు. తెలంగాణకు కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారని.. ఆయన్ను సీఎం కుర్చీలో చూడటమే తన లక్ష్యమన్నారు.మల్లారెడ్డి పార్టీ మారతారనే ప్రచారంతో.. ఇటీవల బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో పంపిన లేఖ వైరల్ అయ్యింది. మల్లారెడ్డి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని.. లక్షలాది మంది కార్యకర్తల విశ్వాసాన్ని మల్లారెడ్డి దెబ్బతీస్తున్నారని కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్ని విస్మరించడం సరికాదని.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యాక్టివ్‌గా ఉన్న మల్లారెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కార్యక్రమాలకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ కార్యక్రమాల వేదికలపై మల్లారెడ్డి కనిపించడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న లక్షలాది మంది కార్యకర్తల్లో తప్పుడు సంకేతాలు వెళు తున్నాయన్నారు.మల్లారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తల్ని తన సంస్థల్లో పనిచేసే ఉద్యోగులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు, కేడర్‌కు అండగా ఉండాల్సింది పోయి దూరంగా ఉండటం పార్టీకి నష్టమన్నారు. పార్టీ సిద్ధాంతాలను, కార్యకర్తలను మరచిపోయిన నేతలు చరిత్రలో కనుమరుగైపోవడం ఖాయమన్నారు. పార్టీపై ప్రేమతో లేఖ రాస్తున్నానని.. ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదన్నారు. ఒక కార్యకర్తగా మనసులో బాధను చెబుతున్నాను అన్నారు. మొత్తానికి మల్లారెడ్డి పార్టీ మార్పు ప్రచారానికి ఎండ్ కార్డ్ వేశారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మరోసారి తేల్చి చెప్పారు.

## ఎల్-నీనో సవాల్‌ను సమర్థవంతమైన ప్రణాళికతో ఎదుర్కొందాం

వచ్చే వంద రోజులకు సరిపడా తాగునీటి నిలువలు ఉన్నాయి

స్థానిక నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి

జలసిరి కార్యక్రమం ద్వారా జల సంరక్షణ చర్యలు చేపట్టాలి

దేశవ్యాప్తంగా ఎల్-నీనో పరిస్థితుల ప్రభావం కనిపిస్తున్న నేపథ్యంలో తెలంగాణలో తాగునీటి సరఫరాపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు.

రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ, అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సింగూరు, పాలేరు వంటి కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, వచ్చే 100 రోజుల పాటు రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు వివరించగా, దానిని కచ్చితంగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు.

మంత్రి సీతక్క అధ్యక్షతన సచివాలయంలో శనివారం నాడు మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ, “2023లో కూడా ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకుండా చేశాం. ఈసారి కూడా అదే నిబద్ధతతో పనిచేయాలి” అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 23,455 ఆవాసాల్లో 90 శాతం గ్రామాలకు సాధారణ స్థాయిలో తాగునీటి సరఫరా కొనసాగుతుండటం సానుకూల పరిణామమని, మిగిలిన ప్రాంతాల్లోనూ సమస్యలు వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే 145 పట్టణ స్థానిక సంస్థల్లో 140



యూఎల్‌బీలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా కొనసాగుతుండటం, మిగిలిన మున్సిపాలిటీలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరుగుతూ ఉండటం సంతృప్తికరమని పేర్కొన్నారు.

మండలాల వారీగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామాల్లో మహిళా సంఘాలు, సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి నీటి సరఫరా సమయాలపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు.

పైప్‌లైన్ లీకేజీలు, మరమ్మతుల కారణంగా ఒకరోజైనా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే పరిస్థితి వస్తే ముందుగానే గ్రామస్తులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా ప్రజలు అవసరమైన ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు.

గ్రామాల్లో ఉన్న బోర్‌వెల్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని, బోర్‌వెల్ల వద్ద రీఛార్జ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్థానిక నీటి వనరులను బలోపేతం చేస్తూ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి నీటి బొట్టును సంరక్షించే దిశగా గ్రామస్థాయిలో అవగాహన పెంచాలని సూచించారు.

16వ ఆర్థిక సంఘం నిధులను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చని, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే ఆర్థిక సంఘం నిధులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

త్వరలో మండల వారీగా సర్పంచ్లతో ఏ ఈ లు సమావేశాలు నిర్వహించి.. తాగునీటి తాజా సరఫరాపై.. సర్పంచ్ల సంతకాలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు.

మిషన్ భగీరథకు ఇంకా అనుసంధానం కాని ఆదివాసీ, గిరిజన గ్రామాలను ఏఈలు వారం రోజుల్లో సందర్శించి నివేదిక సమర్పించాలని, కొన్ని గ్రామాల్లో ప్రతికూల పరిస్థితులు ఉన్న నేపథ్యంలో వారం రోజుల్లో ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహిస్తానని, నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించిన అధికారులను ఉపేక్షించమనని మంత్రి సీతక్క స్పష్టం చేశారు

# బిజినెస్

## ఉద్యోగాలు ఊడుతాయంటే

## ఏఐ విజయం ఎవరికి కావాలి : సత్య నాదెళ్ల



కృత్రిమ మేథపై ప్రజల్లో నమ్మకం తగ్గిపోవడానికి ప్రధాన కారణం ఉద్యోగాలు పోతాయనే భయమేనని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల అన్నారు. ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆయన.. ఏఐవల్ల నాలెడ్జ్ ఆధారిత ఉద్యోగాలన్నీ పోతాయని ఒకవైపు చెబుతారని, మరోవైపు అదే టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నామని గర్వంగా ప్రకటిస్తున్నారని అన్నారు. ఉద్యోగాలే పోతాయంటే ఏఐ విజయాన్ని ఎవరు కోరుకుంటారని ప్రశ్నించారు. ఏఐ రంగం గురించి మాట్లాడుతున్న తీరువల్లే ప్రజల విశ్వాసం దెబ్బతిన్నదని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఉద్యోగాలు కోల్పోతామనే ఆందోళన ప్రజల్లో బలపడిందని, అందుకే ఏఐపై అనుమానాలు పెరుగుతున్నాయని చెప్పారు. కాలేజీల్లో ఏఐ గురించి మాట్లాడితే వ్యతిరేక స్పందన రావడం కూడా ఈ పరిస్థితికి నిదర్శనమన్నారు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే ఏఐవల్ల సమాజానికి ప్రత్యక్ష ప్రయోజనాలు కనిపించాల్సిన అవసరం ఉందని నాదెళ్ల సూచించారు. ఉదాహరణకు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తే స్థానిక ఉపాధి, పన్ను ఆదాయం, పాఠశాలలు, మౌలిక వసతుల వంటి రంగాలకు ఎలా మేలు జరుగుతుందో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని నాదెళ్ల అన్నారు. ఏఐ మనుషుల ఉద్యోగాలను లాక్కోవడానికి కాకుండా కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి ఉపయోగపడాలని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఏయే కొత్త ఉద్యోగాలు అవసరమవుతాయో గుర్తించడం, వాటికి తగిన వేతనాలు నిర్ణయించడంలో కూడా ఏఐ కీలకపాత్ర పోషించగలదని తెలిపారు.

## మెరిడియన్ స్పెషల్ ఎడిషన్.. కేవలం 85 మాత్రమే!



జీప్ ఇండియా.. మెరిడియన్ 85వ యానివెర్సరీ ఎడిషన్‌ను రూ.36.05 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరతో లాంచ్ చేసింది. దీనికి కంపెనీ కేవలం 85 యూనిట్లకు మాత్రమే పరిమితం చేసింది. ఈ స్పెషల్ ఎడిషన్, టాప్ స్పెక్ ఓవర్‌ల్యాండ్ వేరియంట్ ఆధారంగా నిర్మితమైంది. ఇది చూడటానికి స్టాండర్డ్ మోడల్ మాదిరిగా అనిపించినప్పటికీ.. యానివర్సరీ ఎడిషన్‌లో కొన్ని కాస్మొటిక్ అప్డేట్స్ గమనించవచ్చు. ముందు డోర్లు, టెయిల్‌గేట్, వీల్ సెంటర్ క్యాప్స్‌పై 85వ వార్షికోత్సవ డీకాల్స్‌తో పాటు, గ్లాస్ బ్లాక్ 18-అంగుళాల అల్లాయ్ వీల్స్ పొందుతుంది. ఇది తెలుపు, మెటాలిక్ గ్రీన్, ఎరుపు, గ్రిజియో మాగ్నీషియో, నలుపు రంగులలో లభిస్తుంది. క్యాబిన్ మొత్తం నలుపు రంగు థీమ్‌తో ఉంటుంది. డాష్‌బోర్డ్ అంతటా మాయన్ గోల్డ్ ట్రిమ్, కాంట్రాస్ట్ డిటైలింగ్‌తో పాటు యాంబియంట్ లైటింగ్ కూడా ఉంటుంది. అయితే మెకానికల్‌గా ఎలాంటి మార్పులు చేయలేదు. కాబట్టి ఇది 168 ఎప్ట్రజూ పవర్, 350 చీఎ టార్క్ ఉత్పత్తి చేసే 2.0-లీటర్ టర్బో-డీజిల్ ఇంజన్‌తో కొనసాగుతుంది. 9-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఉంటుంది.

# స్పేస్‌ఎక్స్ చరిత్రలో మరో మైలురాయి..

## హిందూ మహాసముద్రంలో సేఫ్ ల్యాండింగ్



అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రైవేట్ సంస్థ స్పేస్‌ఎక్స్ మరో చారిత్రక మైలురాయిని దాటింది. టెక్సాస్ లోని బోకా చిగా వద్దగల స్టార్‌బేస్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన "స్టార్‌షిప్ ఫ్లైట్-13 రోదసిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. భవిష్యత్తులో మానవులను చంద్రుడు, అంగారక గ్రహంపైకి తీసుకెళ్లేందుకు పూర్తిస్థాయి పునర్వినియోగ రాకెట్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు స్పేస్‌ఎక్స్ చేపట్టిన ఈ ప్రయోగం అంతరిక్ష చరిత్రలో ఎంతో కీలకమైనదిగా నిలిచింది. శనివారం ఉదయం నింగిలోకి లేచిన ఈ అత్యంత శక్తిమంతమైన రాకెట్.. నిర్ణీత సమయానికి అంతరిక్షంలోకి చేరుకుంది. ప్రయోగం ప్రారంభమైన రెండు నిమిషాల తర్వాత ప్రధాన రాకెట్ నుంచి బూస్టర్ విభాగం వేరైంది. అయితే తిరోగమన దిశలో గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో ల్యాండ్ కావాల్సిన 'బూస్టర్-20' రాకెట్ ఇంజిన్ స్టార్టింగ్ సమస్యలవల్ల నియంత్రణ కోల్పోయి సముద్రంలో ల్యాండ్ కాకుండా దెబ్బతింది. మరోవైపు ప్రధాన వ్యోమనౌక (స్టార్‌షిప్-40) అంతరిక్షంలో ప్రయాణిస్తూ దాదాపు 20 నెక్స్ట్ జనరేషన్ 'స్టార్‌లింక్ వెర్షన్-3' ఇంటర్నెట్ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి విడుదల చేసింది.

అనంతరం ప్లాన్ చేసినట్లే గంటన్నర ప్రయాణం తర్వాత భూ వాతావరణంలోకి పునఃప్రవేశించి.. హిందూ మహాసముద్రంలో అత్యంత సురక్షితంగా నీటిపై పడి (సాఫ్ట్ స్ప్లాష్ డౌన్) తేలియాడింది. స్టార్‌షిప్ వ్యోమనౌక సముద్రంలో క్షేమంగా ల్యాండ్ కావడం ఇదే తొలిసారి కావడంతో "ఇది ఎంతో సంతోషకరమైన దృశ్యం" అని స్పేస్‌ఎక్స్ బృందం కొనియాడింది. సంస్థ అధినేత ఎలాన్ మస్క్ సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తంచేశారు.

# నా భార్య హాఫ్ ఇండియన్..
# నేను జాత్యహంకారిని కాదు : ఎలాన్ మస్క్



టెస్లా స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ తనపై వస్తున్న జాతి వివక్ష ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాను జాత్యహంకారిని కాదని, తనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని చెప్పారు. 'ది ఎకానమిస్ట్ (ఒప్త్రవ జుఎశీఅశీఎఱర)' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మిమ్మల్ని జాత్యహంకారి అంటున్నారు కదా అని ఇంటర్వ్యూలో హోస్ట్ ప్రశ్నించగా.. మస్క్ తన వ్యక్తిగత జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ సమాధానమిచ్చారు.

'నా జీవిత భాగస్వామి సగం భారతీయురాలు. ఆమెతో నాకు నలుగురు పిల్లలున్నారు. వారిలో ఒక కుమారుడికి ప్రఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త పేరు పెట్టాను. అలాంటప్పుడు నేను జాత్యహంకారిని ఎలా అవుతాను..?' అని మస్క్ ప్రశ్నించారు. మస్క్ భార్య శివోన్ జిలిస్ సగం భారతీయ మూలాలున్న కెనడియన్. వారి కుమారులలో ఒకరి పేరు మధ్యలో 'శేఖర్స ఉంటుంది. నోబెల్ గ్రహీత, భారత-అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం ఈ పేరు పెట్టారు. శివోన్ జిలిస్.. మస్క్ స్థాపించిన న్యూరాలింక్ కంపెనీలో 2017 నుంచి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా తన కంపెనీలలో అన్ని జాతులకు చెందిన వారు ఉన్నత పదవుల్లో ఉన్నారని, అక్కడ ఎలాంటి జాత్యహంకారానికి తావులేదని చెప్పారు. విచిత్రం ఏమిటంటే జాతి వివక్ష ఆరోపణలు ఎదుర్కొంటున్న మస్క్.. స్వయంగా ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్‌ను 'శ్వేతజాతి వ్యతిరేక జాత్యహంకారి' అని నిందించడం సంచలనం రేపుతోంది. ఇటీవల విడుదలైన నోలన్ తాజా చిత్రం 'ది ఒడిస్సీ' మూవీలో నటీనటుల ఎంపిక ఈ వివాదానికి కారణమైంది. ప్రఖ్యాత గ్రీకు ఇతిహాసం 'ది ఒడిస్సీ' లోని హెలెన్ ఆఫ్ ట్రాయ్ పాత్రకు నల్లజాతికి చెందిన ఆస్కార్ విజేత నటి లుపిటా యోంగోను ఎంపిక చేయడాన్ని మస్క్ తీవ్రంగా తప్పుబట్టారు. హోమర్ తన రచనలో హెలెన్ పాత్రను 'లేత చర్మం', 'బంగారు జుట్టు' కలిగిన యువతిగా వర్ణించాడని, దానికి విరుద్ధంగా నల్లజాతి నటిని ఎంపిక చేసి నోలన్ తన సమగ్రతను కోల్పోయారని, హోమర్ సమాధిపై అగౌరవం చూపారని మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఆరోపించారు.

# మెరిసిన ఇషాన్, అభిషేక్..

## అయ్యర్ సారథ్యంలో తొలి పొట్టి సిరీస్ కైవసం..!



వరసగా రెండు వైట్‌వాష్‌లను నుంచి తేరుకున్న భారత జట్టు అదిరే ఆటతో టీ20 సిరీస్ పట్టేసింది. జింబాబ్వేను చిత్తుగా ఓడించి మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్) మెరుపులతో ప్రత్యర్థికి భారీ లక్ష? న్ని నిర్దేశించిన అయ్యర్ సేన 90 పరుగుల తేడాతో గెలిచింది. 220 పరుగుల ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లను ప్రిన్స్ యాదవ్(2-10), అభిషేక్ శర్మ(3-17)లు బెంబేలెత్తించారు. సమిష్టి వైఫల్యంతో ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయిన ఆఫ్రికా జట్టు మరో ఓటమి చవిచూసింది. పొట్టి క్రికెట్‌లో మళ్లీ ఫామ్ అందుకున్న భారత జట్టు టీ20 సిరీస్‌ను కొల్లగొట్టింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో గెలిచిన టీమిండియా రెండో టీ20లోనూ జింబాబ్వేను వణికించింది. రికార్డు స్థాయిలో 52వ సారి రెండొందలకు పైగా కొట్టిన భారత్.. ప్రత్యర్థిని పరిమితం చేసింది. టాపార్డర్ విఫలమైనా బ్యాటుతో రెచ్చిపోయిన ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్)లు భారీ స్కోరొందించగా.. అనంతరం ప్రిన్స్ యాదవ్(2-10), అభిషేక్ శర్మ(3-17)లు వికెట్ల వేటతో చెలరేగారు. బ్యాటుతో విఫలమైన అభిషేక్.. మూడు వికెట్లు తీయడంతో జింబాబ్వే 129కే ఆలౌటైంది. 90 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ఒడిసిపట్టింది. టీమిండియా నిర్దేశించిన 220 పరుగుల భారీ ఛేదనను జింబాబ్వే దూకుడుగా మొదలెట్టింది. ఓపెనర్లు బెన్నెట్(32), బెన్ కరన్(1)లు దూకుడుగా ఆడినా.. అరంగేట్ర పేసర్ యశ్ ఠాకూర్() తొలి దెబ్బ కొట్టాడు. దంచేస్తున్న బెన్నెట్‌ను ఔట్ చేసి బ్రేకివ్వగా.. ఆ తర్వాతి ఓవర్లోనే కరన్‌ను ప్రిన్స్ యాదవ్(2-10) పెవిలియన్ పంపాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో డియాన్ మైర్స్(12) బౌల్డవ్వగా 58 వద్ద ఆతిథ్య జట్టు మూడో వికెట్ పడింది. కష్టాల్లో పడిన జట్టును ఆదుకోవాలనుకున్న కెప్టెన్ సికిందర్ రజా(0)ను ప్రిన్స్ డకౌట్‌గా వెనక్కి పంపి జింబాబ్వేను మరింత కష్టాల్లోకి నెట్టాడు. దూబే ఓవర్లో మద్వేరా(2) అయ్యర్ చేతికి చిక్కడంతో ప్రత్యర్థి ఓటమిని ఖాయమైంది. రియాన్ బర్ల్(20)ను తిలక్ ఔట్ చేయడంతో టీమిండియా విజయం మరింత తేలికైంది. బ్యాటుతో తేలిపోయిన అభిషేక్(3-17) బంతితో రాణించగా జింబాబ్వే 129 పరుగులకే కుప్పకూలింది.

### ఇషాన్, తిలక్ విధ్వంసం



హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో టాస్ ఓడిన భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ(8) ఈసారి కూడా నిరాశపరిచాడు. తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన అతడిని ముజరబని పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ(20) జింబాబ్వే బౌలర్లను భయపెట్టాడు. కానీ, అదే ఊపులో ఆడబోయి అతడు వికెట్ సమర్పించుకున్నాడు.


29కే రెండు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(25), ఇషాన్ కిషన్(81)లు దూకుడుగా ఆడి స్కోర్‌బోర్డును ఉరికించారు. తిలక్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకోగా రింకూ సింగ్(12) విఫలమయ్యాడు. ఇషాన్, తిలక్ విధ్వంసంతో నిర్ణీత ఓవర్లలో టీమిండియా 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబని, నగవరా, ఎవాన్స్, న్యూమన్, బెన్నెట్‌లు తలా ఒక వికెట్ తీశారు.

# స్పోర్ట్స్

## మళ్లీ తస్సుమన్న అభిషేక్..
## వైభవ్ ధాటిగా ఆడినా..!



టీమిండియా డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ వైఫల్యాల పరంపర కొనసాగుతోంది. వరుసగా ఐదో మ్యాచ్‌లో అతడు నిరాశపరిచాడు. చివరిగా ఇంగ్లండ్‌తో తొలి టీ20లో అర్ధ సెంచరీ చేసిన అతడు.. ఆతర్వాత వరుసగా 43, 10, 16, 3, 1 పరుగుకు ఔటయ్యాడు. ఇవాళ (జులై 25) జింబాబ్వేతో జరుగుతున్న రెండో టీ20లో ఓ మోస్తరు స్టార్ట?? లభించినప్పటికీ సద్వినియోగం చేసుకోలేక వికెట్ పారేసుకున్నాడు. 8 బంతుల్లో 2 ఫోర్ల సాయంతో 8 పరుగులు చేసి బ్లెస్సింగ్ ముజరబానీ బౌలింగ్‌లో ర్యాన్ బర్ల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అభిషేక్ త్వరగా ఔట్ కావడంతో రెండో టీ20లో భారత్ ఆదిలోనే ఒత్తిడిలో పడినట్లైంది. అతడు ఔటైన వెంటనే మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఔటయ్యాడు. తొలి మ్యాచ్ ఫామ్‌ను కొనసాగించిన వైభవ్ భారీ ఇన్నింగ్స్ ఆడతాడని భావిస్తే.. 9 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్ సాయంతో 20 పరుగులు చేసి పెవిలియన్ బాట పట్టాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 29 పరుగులకే ఓపెనర్లిద్దరి వికెట్లు కోల్పోవడంతో కష్టాల్లో పడింది. ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ క్రీజ్‌లో ఉన్నారు. కాగా, ఈ మ్యాచ్ కోసం భారత్ రెండు మార్పులు చేసింది. అశోక్ కుమార్ స్థానంలో యశ్ ఠాకూర్ తుది జట్టులోకి వచ్చాడు. యశ్ ఠాకూర్‌కు ఇది తొలి టీ20 మ్యాచ్. కెప్టెన్ అయ్యాక వరుసగా ఏడు టాస్‌లు గెలిచిన శ్రేయస్ ఎట్టకేలకు ఎనిమిదో మ్యాచ్‌లో టాస్ ఓడాడు. 3 మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ తొలి మ్యాచ్ గెలిచి 1-0 ఆధిక్యంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.




# జెట్ స్పీడ్.. నెల రోజుల్లోపే ‘ది ప్యారడైస్’ విలన్ సినిమా కంప్లీట్..!

కిల్ సినిమాతో సూపర్ పాపులారిటీ సంపాదించాడు రాఘవ్ జుయల్. ఈ టాలెంటెడ్ యాక్టర్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న ది ప్యారడైస్‌లో విలన్‌గా కనిపించబోతున్నాడని తెలిసిందే. అయితే ఈ మూవీ కంటే ముందు రాఘవ్ జుయల్ హిందీ ప్రాజెక్ట్ ‘భాయ్ తేరా స్టార్ హై’ సినిమాలో హీరోగా కనిపించబోతున్నాడు. ఈ మూవీలో పాపులర్ డిజిటల్ కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్ఎం ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా బాలీవుడ్ హంగామాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ వివేక్ అగర్వాల్ ఆసక్తికర విషయం ఒకటి షేర్ చేసుకున్నారు. రాఘవ్ జుయల్ హీరోగా నటించిన భాయ్ తేరా స్టార్ హై సినిమాను కేవలం నెలలోపై షూట్ చేశారట. సినిమా మొదలవ్వగానే విస్తృతమైన వర్క్‌షాప్‌లను నిర్వహించామని.. ప్రతీ ఒక్క యాక్టర్ తమ లైన్స్‌ను ముందస్తుగానే నేర్చుకుని ప్రిపేర్ అవడం వల్లే సినిమా షూటింగ్‌ను త్వరగా పూర్తి చేసే అవకాశం దొరికిందని అన్నాడు. తాను ఓ పెద్ద సూపర్‌స్టార్ అవుతానని భ్రమల్లో బతికే ఒక యాక్టర్ చుట్టూ తిరిగే కథాంశంతో తెరకెక్కుతోంది ‘భాయ్ తేరా స్టార్ హై’. కానీ అతడు మాత్రం ఓ బ్యాడ్ నటుడిగా ఉండిపోతాడు. సంజయ్ కపూర్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. వచ్చే వారం ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ది ప్యారడైస్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం.. అది కూడా నానితో ఫైట్ చేయబోతుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

# ‘ఆదర్శ కుటుంబం’లో పోలీస్‌గా నారా రోహిత్..

**బర్త్‌డే సందర్భంగా పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ విడుదల**




టాలీవుడ్‌లో మోస్ట్ లవబుల్ హీరోగా గుర్తింపు పొందిన విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో, శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘ఆదర్శ కుటుంబం’. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నేడు (జూలై 25) నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రోహిత్ ఎంతో స్టైలిష్, డైనమిక్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ముఖ్యంగా పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించిన తెలంగాణ పోలీస్ బోర్డు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌తో నారా రోహిత్ ఈ సినిమాలో పోలీస్ అధికారిగా నటిస్తున్న విషయం దాదాపు ఖరారైంది. ఆయన పాత్ర సాధారణ పోలీస్ పాత్ర కాకుండా, మాస్ అప్పీల్‌తో పాటు కథను కీలక మలుపు తిప్పే శక్తివంతమైన అధికారిగా ఉండబోతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చాలా కాలం తర్వాత రోహిత్ మరోసారి యూనిఫామ్‌లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఇప్పటికే వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, వినోదం, యాక్షన్ అంశాలను సమపాళ్లలో మేళవిస్తూ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్, ఎమోషనల్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను అలరించనున్నారని సమాచారం. ఈ చిత్రానికి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. అత్యున్నత నిర్మాణ విలువలతో హారికా అండ్ హాసిని క్రియేషన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ‘ఆదర్శ కుటుంబం’ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌తో పాటు నారా రోహిత్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్ర కూడా ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కొత్త కాంబినేషన్?



ఓ వైపు కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా, మరోవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు రష్మిక మందన్నా. మరోవైపు ఇటు సినిమాలు అటు ఓటీటీ ప్రాజెక్ట్స్‌తో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకులు రాజ్ నిడిమోరు (రాజ్), కృష్ణ దాసరి (డీకే). వీరిద్దరూ తాజాగా రష్మిక కోసం ఓ పవర్‌ఫుల్ కథని సిద్ధం చేస్తున్నారట. కాగా ఇటీవలే రాజ్ నిడిమోరు అందించిన కథతో సమంత లీడ్ రోల్‌లో రూపొందిన ‘మా ఇంటి బంగారం’ సినిమా సూపర్ హిట్ కావడంతో పాటు రూ. 100 కోట్లు వసూళ్లు సాధించిన సంగతి తెలిసిందే. అందం, అభినయంతో పాన్ ఇండియా స్థాయిలో తనకంటూ అభిమానులను సం పాదించుకున్న రష్మికతో ఇప్పుడు ఓ సినిమా ప్లాన్ చేస్తున్నారట రాజ్ అండ్ డీకే. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు ఆరంభంలో ఉన్నాయని సమాచారం. రష్మిక ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకుని పూర్తి స్క్రిప్ట్ రెడీ చేసిన తర్వాత ఆమెను కలిసి వినిపించనున్నారట రాజ్--డీకే. మరి... వార్తల్లో ఉన్నట్లు ఈ కొత్త కాంబినేషన్ కుదురుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

# ‘రామాయణ’కు రికార్డు స్థాయి ప్రమోషన్స్? ప్రచారానికే రూ.375 కోట్ల ఖర్చు చేస్తున్నారా..!



భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మైథలాజికల్ చిత్రం రామాయణ’పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ రూపొందిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దాదాపు రూ. 4,000 కోట్ల వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యష్ రావణుడి పాత్రలో నటిస్తున్నారు. మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయాలని, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌కు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అధికారిక ట్రైలర్ జూలై 24న విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, అది అనూహ్యంగా వాయిదా పడింది. ఈ నిర్ణయం వెనుక హాలీవుడ్ దిగ్గజ సంస్థ సోనీ పిక్చర్స్ ప్రపంచవ్యాప్త పంపిణీ హక్కులను దక్కించుకోవడమే ప్రధాన కారణమని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని హాలీవుడ్ స్థాయిలో గ్రాండ్ మార్కెటింగ్ క్యాంపెయిన్ రూపొందిస్తున్న నేపథ్యంలో, కొత్త ప్రమోషనల్ ప్లాన్‌కు అనుగుణంగా ట్రైలర్ విడుదల తేదీని మార్చినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం, విదేశీ మార్కెటింగ్ కోసం సోనీ పిక్చర్స్ దాదాపు రూ. 235 కోట్లు, భారతీయ నిర్మాతలు మరో రూ. 140 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తంగా ప్రచారం, గ్లోబల్ మార్కెటింగ్ కోసం సుమారు రూ. 375 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమాచారం అధికారికంగా ధృవీకరించబడనప్పటికీ, ఒకవేళ ఇదే నిజమైతే భారతీయ సినిమా చరిత్రలో ప్రమోషన్స్ కోసం ఇంత భారీ మొత్తం కేటాయించిన తొలి చిత్రంగా ‘రామాయణ’ రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేతలు హాన్స్ జిమ్మర్, ఏ.ఆర్. రెహమాన్ కలిసి సంగీతం అందిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. అత్యాధునిక ఐమాక్స్ ఫార్మాట్, ప్రపంచ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, భారీ ప్రొడక్షన్ డిజైన్‌తో ఈ చిత్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిస్తున్నారు..



# నాపై ఒత్తిడి ఉండటం మంచిదే!: జై కృష్ణ

“నేను ఫ్యాన్స్‌కి ఇంకా ఏమీ ఇవ్వలేదు. అయినప్పటికీ వాళ్లు నాపై ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. నేనీ సినిమా చేస్తున్నానని తెలియక ముందు నుంచే ఘట్టమనేని అభిమానులు నన్ను స పోర్ట్ చేశారు. అందుకే నటుడిగా వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టాలి... నటుడిగా నన్ను నేను నిరూపించుకోవాలి. మంచి కథలు, మంచి పాత్రలు చేయాలనే ఆలోచన నాకు మొదట్నుంచే ఉంది. ఈ విషయంలో నాపై ఒత్తిడి ఉండటం మంచిదే. అది నన్ను మంచి కథల వైపు తీసుకువెళ్తుంది” అని జై కృష్ణ అన్నారు. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు రమేష్‌బాబు కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న సినిమా ‘శ్రీనివాస మంగాపురం’. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా పరిచయం అవుతున్న ఈ సినిమాకు అజయ్ భూపతి దర్శకత్వం వహిం చారు. అశ్వినీదత్ సమర్పణలో పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో జై కృష్ణ చెప్పిన సంగతులు...

**నా 16 ఏళ్ల వయసులో యాక్టర్ కావాలని నిర్ణయించుకున్నాను.**

ఆ తర్వాత శిక్షణ తీసుకోవడం ప్రారంభించాను. రెండేళ్లు ముంబై, తర్వాత పాండిచ్చేరి, నెక్ట్స్ న్యూయార్క్ వెళ్లి యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత ఇండియా వచ్చి కథలు వినడం ప్రారంభించాను. కొన్ని కథలు విన్న తర్వాత, నిర్మాత పి. కిరణ్‌గారి ద్వారా దర్శకుడు అజయ్ భూపతిగారిని కలిశాను. అజయ్‌గారు చెప్పి కథ నచ్చడంతో, ‘శ్రీనివాస మంగాపురం’ సినిమా చేశాను. మంచి క్యారెక్టరైజేషన్, మంచి ఎమోషన్‌తో కూడిన కథతో ప్రేక్షకుల ముందుకు రావాలనుకున్నాను. నేను అనుకున్న అంశాలు ఈ కథలో కుదిరాయి. ఈ చిత్రం కోసం అజయ్‌గారు 3 నెలలు వర్క్‌షాప్ చేయించారు. లుక్ టెస్ట్, స్క్రీన్ టెస్ట్, డైలాగ్స్... ఇవన్నీ ముందుగానే ప్రిపేర్ అయ్యాం.

ఇందులో నేను శ్రీను అనే రోల్ చేశాను. శ్రీనుకి కాస్త అల్లరితనం ఉంటుంది. కానీ తనకేం కావాలో తనకి స్పష్టంగా తెలుసు. తను మంగను (రాషా తడానీ) ప్రేమిస్తాడు. ఆ తర్వాత కథ ఎలా సాగుతుంది? అన్నదే మిగిలిన సినిమా కథాంశం. ఇది రెగ్యులర్ లవ్‌స్టోరీ సినిమా కాదు. ఈ చిత్రంలో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి. ట్విస్ట్‌లు కొత్తగా ఉంటాయి. అజయ్‌గారు క్లారిటీ ఉన్న దర్శకుడు. అశ్వినీదత్‌గారితో నాకు మంచి అనుబంధం ఉంది. వైజయంతి మూవీస్‌లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో లాంచ్ కావడం హ్యాపీగా ఉంది. బాబాయ్ (మహేశ్‌బాబు) తొలి సినిమా కూడా ఈ బ్యానర్‌లోనే రూపొందింది. నాకు ఫ్యామిలీ స పోర్ట్ ఉంది. నా ప్రతి అడుగులో బంగారు తాతయ్య (కృష్ణ సోదరుడు--నిర్మాత ఆదిశేషగిరి రావు) ?ర పోత్సాహం ఉంది. నేను సినిమాల్లోకి రావాలని, మంచి నటుడిగా ఎదగాలని మా తాతయ్య (కృష్ణ)గారు కోరుకున్నారు. మా నాన్నగారు ఉన్నప్పుడు సినిమాల గురించి చర్చించుకునేవాళ్లం. నేను యాక్టర్ కావాలనుకున్న తర్వాత బాబాయ్ సలహాలు, సూచనలు ఇచ్చారు. దర్శకుడు విజన్‌కు తగ్గట్లు యాక్ట్ చేయాలని చె??పారు. అలాగే ‘శ్రీనివాస మంగాపురం’ చూసి, హ్యాపీ ఫీలయ్యారు. ఈ సినిమా ఆయనకు నచ్చింది. యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంగ్స్ చాలా నచ్చాయని చె??పారు. స్క్రీన్‌పై డిఫరెంట్‌గా కనిపిస్తున్నావని, క్యారెక్టర్‌లోకి పూర్తిగా వెళ్లి పోయావని చెపారు. నా చిన్నతనంలో నేను సినిమా వాతావరణానికి దూరంగా ఉండి చదువుకునేవాడిని. మొదటిసారి ‘నిజం’ సినిమా షూటింగ్‌కు వెళ్లాను. ఇందులో చైల్డ్ క్యారెక్టర్ చేశాను. ఆ తర్వాత ‘అర్జున్’ షూటింగ్‌కు వెళ్లాను. ఈ చిత్రానికి మా నాన్నగారు నిర్మాత. ‘గుంటూరు కారం’ షూటింగ్‌కు వెళ్లాను. ఒక యాక్టర్‌గా నాకు విభిన్న జానర్స్‌లో సినిమాలు చేయాలని ఉంది. కానీ యాక్షన్ సినిమాలు చేయడం ఎక్కువ ఇష్టం. నేను యాక్టర్‌ని కావాలనుకున్నప్పుడే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967